# కవితా కౌముది - 2014





శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 127



# విషయ సూచిక


| ఏడాది | నెల | కవిత | కవి / కవయిత్రి | పేజి |
|---|---|---|---|---|
| 2014 | 01 | మళ్లీ మళ్లీ | మోహన తులసి | 6 |
| | | ముసురు | డా వైదేహీ శశిధర్ | 7 |
| | | నిశ్శబ్ద చిత్రం | విన్నకోట రవిశంకర్ | 8 |
| | | దేహానంతరం | క్రాంతి శ్రీనివాసరావు | 9 |
| | | మంచు గబ్బిలం | డా కె గీత | 10 |
| | | కాలాన్ని పట్టుకో | జ్యోతిర్మయి మళ్ళ | 11 |
| | | వాడు నేనూ | నాగ మురళీధర్ నామాల | 12 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 13 |
| | | | | |
| 2014 | 02 | ప్రకృతి యాత్ర | ప్రసాద్ అట్లూరి | 14 |
| | | మౌనం మాట | డా జడా సుబ్బారావు | 16 |
| | | ఆఖరి శ్వాస | పంజా | 17 |
| | | ఎంతయినా | సంధ్య యల్లా ప్రగడ | 17 |
| | | చిట్లి పోయిన మొలక విత్తనం | కొత్తపల్లి ఉదయ బాబు | 18 |
| | | నిర్వచనోత్తర యుద్దయణం | డా నారాయణ గరిమెళ్ళ | 19 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 20 |
| | | | | |
| 2014 | 03 | ఒద్దిక | మరువం ఉష | 21 |
| | | కాలం పాఠం | శిద్దాని | 22 |
| | | వలస పక్షి | పి రామకృష్ణ | 23 |
| | | జంట | హరీష్ | 23 |
| | | భ్రమణం | ఎస్ ఎస్ వి రమణారావు | 24 |
| | | వెన్నెల | తమస్విని | 25 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 26 |

| | | | | |
|---|---|---|---|---|
| 2014 | 04 | ప్రభుత్వోద్యోగి | కొత్త పల్లి ఉదయ బాబు | 27 |
| | | పసి(డి) కలలు | భవానీ ఫణి | 28 |
| | | చీకటి చుక్కలు | మహర్షి | 29 |
| | | ప్రేమ | హరీష్ | 30 |
| | | కోతల సమయం | వేణు ఆసూరి | 30 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 31 |
| | | | | |
| 2014 | 05 | చిరుదరహాసం | దీప్తి శ్రీనివాస్ పెండ్యాల | 32 |
| | | ఆకాశానికి నిచ్చెన | ఆర్ శర్మ దంతుర్తి | 33 |
| | | మనిషి | ఎం వి వి ఎస్ ఎస్ ప్రసాద్ | 34 |
| | | నానమ్మ | శ్రీరమ్యామృత | 35 |
| | | (యమ) ధర్మ సందేహం | వ్యాకరణం అచ్యుత రామారావు | 36 |
| | | ప్రజాస్వామ్యం | గోవింద చింతాడ | 37 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 38 |
| | | | | |
| | | కృతజ్ఞతలు | డా నారాయణ గరిమెళ్ళ | 40 |
| | | రహదారిలో గడ్డిపోచలు | డా మాదిన రామకృష్ణ | 41 |
| | | స్వేదం | భరత్ భూషణ్ రెడ్డి | 42 |
| | | తాళం | కామేష్ పూళ్ళ | 43 |
| | | నేనొక విహంగమై | చెన్నూరు నరేంద్రనాథ్ | 44 |
| | | రొమాన్స్ చచ్చి పోయింది | శివ్వాల గోవిందరావు | 46 |
| | | మొదటి కవిత | కర్రి రఘునాథ శంకర్ | 47 |
| | | నా యుగం | మల్లిపూడి రవిచంద్ర | 49 |
| | | అడవిలా | ప్రసూనా రవీంద్రన్ | 51 |
| | | నిర్భయ | హరీష్ గొర్లె | 52 |
| | | ప్రవహిస్తూనే ఉంటా | దోర్నాదుల సిద్ధార్థ | 53 |
| | | | | |
| 2014 | 06 | మళ్లీ రాయాలి మలిపి మరో కొత్త గీతం | నాగరాజు రామస్వామి | 54 |

| | | | | |
|---|---|---|---|---|
| | | మేలి ముసుగులు | అల్లూరి గౌరీలక్ష్మి | 55 |
| | | దేహచరిత్ర | రేణుక  అయోల | 56 |
| | | ఊహోలు ఉత్పాతాలు | విజయ చావలి | 57 |
| | | ఓ కాలమా ఇది నీకు న్యాయమా | లలిత చిట్టె | 58 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 59 |
| | | | | |
| 2014 | 07 | నీడ | వ్యాకరణం అచ్యుత రామారావు | 60 |
| | | నిజం | పి వాణి | 61 |
| | | నేను మానని గాయాన్ని | మధుకర్ వై | 62 |
| | | అక్షరాలు | డా జి శ్యామల | 63 |
| | | ఎన్నో తప్పుల తర్వాత | పి రామకృష్ణ | 64 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 65 |
| | | | | |
| 2014 | 08 | ఎందుకిలా చేశావ్ | పద్మా శ్రీరామ్ | 66 |
| | | తప్పవుతుందా | కె వి శాస్త్రి | 67 |
| | | గుప్తనిధి | శ్రీ రమ్యామృత | 68 |
| | | సూక్ష్మం | రిషి శ్రీనివాస్ | 68 |
| | | పుష్ప వికాసం | శారద శివపురపు | 69 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 70 |
| | | | | |
| 2014 | 09 | అంతర్వీక్షణం | అల్లూరి గౌరీలక్ష్మి | 71 |
| | | నువ్వో తత్త్వవేత్తవా నేస్తం | నాదెళ్ళ అనూరాధ | 72 |
| | | అమ్మ మాట | స్వర్ణ అట్లూరి | 73 |
| | | హైకూలు | రామకృష్ణ క్రొవ్విడి | 74 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 75 |
| | | | | |
| 2014 | 10 | ఓటమి తర్వాత | ఎం వీ రామిరెడ్డి | 76 |
| | | | ఎస్ ఆర్ బందా | 77 |
| | | సంఘజీవి | శశిప్రియ వంగల | 78 |

| | | | | |
|---|---|---|---|---|
| | | నాకూ నవ్వాలని ఉంది | సుకేశిని | 79 |
| | | క్షణ కాలం | బొడ్డపాటి ఆనందరావు | 79 |
| | | జాల విహారం | గంగిశెట్టి | 80 |
| | | కొనగోటి వీరులు | శ్రీకాంత్ ఒద్దిరాజు | 81 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 82 |
| | | | | |
| 2014 | 11 | రేపటి ఆశ | స్వర్ణ అట్లూరి | 83 |
| | | రెక్కలు | డా రమణ యశస్వి | 84 |
| | | ఆలోచనలు | శారద శివపురపు | 85 |
| | | అతివనే | రావి సురేష్ బాబు | 86 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 87 |
| | | | | |
| 2014 | 12 | బాలమురళీయం | డా సి భవానీదేవి | 88 |
| | | బాల్యం ఒక మోహ నది | వెంకట్ | 89 |
| | | అభి "మానులు" కాకండి | దేగల అనితాసూరి | 90 |
| | | ఏ మాసమైతేనేం | నాదెళ్ళ  అనూరాధ | 91 |
| | | కృష్ణం వందే జగద్గురుం | ఇవటూరి బాలాత్రిపుర సుందరి | 91 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 92 |
| | | | | |

# మళ్ళీ మళ్ళీ

మోహనతులసి

తీగ ఒలకడం ఆగిపోతుంది
గాలిలో అక్కడక్కడా ఆ శబ్దం
ముక్కలు ముక్కలుగా
దూరంగా....వలయాలుగా.

తెలిసిన పాటల్లేనే
ఒకప్పుడు నడిపించిన మోహమల్లేనే
ఉంటుంది
ముగింపు తెలిసిపోతూనే ఉంటుంది.

అయినా
ఆ రాగాలనే ఏరుకుంటూ,
మళ్ళీ మళ్ళీ అదే పాట పాడుకుంటాం!

ఎవర్నీ మర్చిపోలేం
అందరూ గుర్తుకొస్తారు
ఒక మాటలోనో, ఒక దృశ్యం లోనో!

వెన్నెల విరగకాసినప్పుడు,
ఏవో మెట్లెక్కి దిగుతున్నప్పుడు,
లీలగా మెదిలే నీడల్లో
నిండు నదుల్ని వెతుక్కుంటూ
ఆగీ ఆగీ వెనక్కి తిరిగిచూస్తాము.



తెలిసిన ముఖాలేమో అన్నట్టు,
మళ్ళీ మళ్ళీ....
దారులు కలుస్తాయేమో అన్నట్టు.

ఏదో ఒకరోజుకి చలిగాలలవాటవుతుంది గానీ
కంటికొసల్లో ప్రపంచాన్ని గిరాటేసి
ఎవరి వేలో పట్టుకుని గిరికీలు కొడుతూ
ప్రవహించే జీవనదిలా ఉప్పొంగిన
నాకు నేను, నీకు నువ్వు గుర్తొస్తాం,
ఎప్పుడొకప్పుడు!

సరిగ్గా అలాంటప్పుడే,

నిఖార్సైన  ప్రాణవాయువుల్ని పోగేసుకుంటాం.
విశాల మైదానంలోకి పరుగులు తీస్తూ,
కురులంచుల్ని తాకుతూపోయే వెన్నెల తుంపర్లని
దోసిట పట్టొస్తాం.
ఇవన్నీ,
అన్నీ కురిసే మబ్బు చెమ్మ చిహ్నాలే... !

తెలుసు అన్నీ తిరిగెళ్ళి
మళ్ళీ మళ్ళీ గతమే అవుతుందని. ★★★

# ముసురు

డా.వైదేహీ శశిధర్

పొగచూరిన మబ్బులతో వెలవెల బోతూ
తెల్లవారిన ఆకాశాన్ని చూసి
సూర్యుడు కూడా ముఖం చాటేశాడు

కిటికీ తెరల సందుల్లోంచి నిత్యం విధిగా
మేలుకొలుపు పాడే వెలుగు కిరణాల తీగలు
ఈ రోజు మబ్బులచాటున మడతలు పడి
తికమకగా మూగపోయాయి

బయట ముసురు పట్టినప్పుడల్లా
మనసంతా చిక్కుపడ్డ దారపు ఉండలా
చిరాకు చిరాకుగా  ఉంటుంది .

కాలిలో ముళ్ళు దిగినట్లు  కాలం
కుంటుకుంటూ  మెల్లగా నడుస్తుంది

బలహీనుడి నిర్వేదం లాంటి  బూడిదరంగు మబ్బుల్ని
తలకెత్తుకున్న ఆకాశం
తన భారాన్ని తనే మోసుకుంటూ తిరిగే తాబేలై
రోజంతా  ఆపసోపాలు పడుతూనే ఉంటుంది .

ఇలా  ఎటూ తేలని సందిగ్ధతతో  తటపటాయించే బదులు
ఈ ఆకాశం అటు దుఃఖావేశంతో కుండపోతగా వర్షించినా
ఇటు భగ్గున ఆగ్రహంతో ఎర్రగా మండిపడినా ఎంతో బావుంటుందనుకుంటూ
నేను మాత్రం రోజంతా బద్ధకపు దుప్పటి క్రింద కలత నిద్రతో గడిపేస్తాను.

★★★★

# నిశ్శబ్ద చిత్రం

విన్నకోట రవిశంకర్

మోగని గంటల్లా
వ్రేలాడే పువ్వులతో చేరి
మూగబోయింది ఒక గంట

మాటలు లేకుండానే
ఆహ్వానించే పుష్పాన్ని కలిసి
ఝుంకారాన్ని వదులుకుంది తుమ్మెద

సుతిమెత్తని రెక్కలతో
సద్దుచెయ్యకుండా ఎగిరే
సీతాకోక చిలుకను చూసి
పాటను పరిత్యజించింది పక్షి

స్వచ్ఛమైనవి కొన్ని
స్వచ్ఛందమైనవి కొన్ని
మౌనాలు కలిపి అల్లిన
ఈ  చిన్నిప్రపంచంలోకి
చొరబడలేక
శబ్దం తలవంచుకొని
నిష్క్రమించింది.

***



# దేహానంతరము

క్రాంతి శ్రీనివాసరావు

జ్ఞాపకాలకు

ఊహలకు

మధ్య కట్టిన

వొంటితాడుపై

ఉయ్యాలూగుతూ

నిజాలగడ పట్టుకొని

నడిచే నడక వొడుపుచూసి

కాలం విసిరే చిల్లర

నీవు పోయాక

బతికేందుకు

ఖర్చులకు అక్కరకొస్తాయి!

ఉత్తమ కలలు

ఉన్నత లక్ష్యాలు

రెండువైపులా

మనసు నాగలికి కట్టి

బతుకు పొలం దున్ని

పండించిన పంటే

నీవు పోయాక

బతికేందుకు ఆహారమవుతుంది!

త్యాగాల దారాలతో

ఊపిరిమగ్గం పై

నేచిన బట్టలే

నీవు పోయాక

బతికేటప్పుడు

కట్టుకొనేందుకు పనికి వస్తాయి!

ప్రపంచ ఉన్నతికై

చావుతో సరసమాడి

నీవు కన్న సంతానమే

నీవు పోయాక

బతుకుకు

తోడునిలుస్తుంది!

ఎప్పుడో పోయినా

తరాలు గడచిపోయినా

ఇంకా

మన గుండె కొక్కానికి

తగిలించబడ్డ

వారి చొక్కా జేబులో

వెతుకుదాం

దేహానంతర జీవిత రహస్యమేదన్నా

దొరుకుతుందేమో !! ★★★

# మంచుగబ్బిలం డా. కె.గీత

ఎముకలు కొరికే చలిలో
ఆరో వీధి చెత్తకుప్ప సందులో
తెల్లారగట్ల అట్టముక్కల మధ్య
ఎండిన చెక్కపొట్టు మధ్య చుట్టబెట్టిన ఆకారం
నిద్రలోనూ సలుపుతున్న ఆలోచన్లలా ఉలిక్కిపడుత్తూ
చివికిన బొచ్చు తల టోపీ లోంచి
మకిలి దొర్లుతున్న జుట్టు
లోపల గాయాలు రేగి చర్మం వేళ్లాడుతున్నట్లు
అసహనంగా కదిలే తుప్పు బూట్లు
ఎప్పుడు లేస్తుందో తెలీదు
రోజల్లా రోడ్లపై దొర్లించుకుంటూ తిరిగే
షాపింగు కార్టే సర్వస్వం
అట్టముక్క మీద
పెన్నీ దానం చెయ్యండి
హోంలెస్ ప్లీజ్ హెల్ప్
వర్క్ ఫర్ ఫుడ్
నిశ్శబ్దంగా అర్థించేదేదైనా
కూలబడ్డ కళ్లల్లో కనిపించేదొకటే
అమెరికా రోడ్డు మీద
గూడు లేని పొరుడికి
వెచ్చని ఆశ -
నిలువెల్లా వణికే మనిషికి
గుండె లో ఎక్కడో
బతికించే
ఒక వెచ్చని ఆశ-
స్నానం పానం లేని
బట్టల వెనుక శరీర దుర్గంధాన్ని
శరీరం కంటే పుచ్చిన చెత్త కుప్ప వాసనని
దంత ధావనం లేని గొగ్గి పళ్ల కింద నలిగే గంజాయి
గొయ్యి తీసి శవాన్ని కప్పెట్టినట్టు దాచి పెడుతుంది
అతను ఒకప్పుడు అన్నీ ఉన్నవాడు కావచ్చు
నిరుద్యోగం ఇంటిని
గూడులేనితనం బంధాల్ని
మింగేస్తాయిక్కడ
అతనెంత పనిమంతుడైనా కావొచ్చు
చిరునామా లేకుండా ఐడెంటిటీ
ఉనికి లేకుండా ఉద్యోగం ఉండవిక్కడ
వేల సంఖ్యలో పదులకు మాత్రమే
దొరికే వసతి గృహం
రోజు వారీ నిరాశ బతుకుల పాలిటి చీకటి లాటరీ-
ప్రతీ మధ్యాహ్నం నుంచీ వంతు కోసం
కొట్టుకునే గుండెకి
రోడ్డు పక్కన , పార్కు లోపల, పదిమంది తిరిగే చోట
స్వేచ్ఛ గా నిద్రపోనివ్వని కఠిన నిబంధనల దేశమిది
రాత్రంతా పోలీసుకంట పడకుండా
పరుగెత్తే కాగితం చుట్ట
తిరిగి తిరిగి ఎక్కడో ఒక ఇరుకు
కుప్ప పక్కన పడేసిన
సామాన్లలో విరిగిన బల్లలా
కాళ్లూ, చేతులూ కడుపులోకి విరుచుకుని
తెల్లారగట్ల చలిని మునిపంట
కొరికే ఆకారం
భూతల స్వర్గపు వీధుల్లో
మంచు గబ్బిలమై వేళ్లాడుతూ ★★★
(సిలికాన్ వేలీలో నిరాశ్రయులై తిరిగే మనుషుల గురించి)

# కాలాన్ని పట్టుకో

జ్యోతిర్మయి మళ్ళ

కాలం వడివడిగా ముందడుగేస్తోంది
మనకాలాన్ని ఒకో్క క్షణంగా మింగేస్తూ
వర్తమానాన్ని భూతంగా మిగిలిస్తూ
కొన్నికోట్ల క్షణాలు అలా వెళ్ళినవే !
క్షణమైనా ఆగకుండా
ఒక్క లక్ష్యమైనా చేరకుండా
ఒకో్కసారి ఒక్కక్షణమే
మిగులుస్తుంది కోట్లక్షణాల అనుభవాన్ని !
అలాంటి క్షణాలు కావాలి మనకు వేలు లక్షలుగా
కాలచక్రపు బండెక్కి ఎగిరిపోతూ
కరిగి కనుమరుగవుతున్న క్షణాల్ని
కొన్నిటినైనా పట్టుకోవాలంటే
మన జీవితపుటల్లోకెక్కి కూచుని
కడదాకా కనపడే వెన్నెల చుక్కల్లాగా
నిక్షిప్తం చేసుకోవాలంటే
ఇంకా ముడుచుకుపడుకుంటే కాదు,
ఇక రెక్కలు విదుల్చుకుని
ఒక్కసారి పైకెగరాలి,
ముసగదీసుకున్న బద్ధకానికి
ఇకనైనా బుద్ధిచెప్పాలి,
మగతకమ్మిన నిద్రని
ఇప్పుడిక వీపుచరిచి మేల్కొలపాలి

★★★★★

# వాడూ నేనూ

నాగ మురళీధర్ నామాల

నువ్వు నిద్దరోతే
నేను లేస్తానంటాడు వాడు
వాడు లేస్తే
ఇంక నాకు నిద్దరేది?

నిమిషాలపాటూ నిదానంగానే ఉంటాడు
ఊపిరి పీల్చుకుంటాను
ఉండుండి లేచి నిలబడతాడు
గుండెల్లో గుబులు మొదలవుతుంది

అలవాటుగా ఆ తెర తీసి
నిర్లిప్తంగా తొంగి చూస్తాడు
ఆవల ఎన్నడూ చూడనిదే కానీ
పరిచయమనిపించేదే ఏదో తీరం

ఆ ఇసుక తిన్నెల్లో
గాజుగోళాల్లా దొర్లుతూ స్వప్నాలు
వాటి మధ్య చేరి వెతుకుతూ ఉంటాడు
ఏం పోగొట్టుకున్నాడో

వెతుకులాటకి ఒక రూపం రాగానే
వగరుస్తూ లేచి ఊగిపోతాడు
గుండెలవిసేలా తీరమంతా పరిగెడతాడు
కూలబడి ఒక మూల దాక్కుంటాడు

ఆ గోళాలన్నీ భళ్ళున పగిలిపోతాయి
రక్తం స్రవిస్తాయి
ఆ రోజుకి వాడు చచ్చిపోతాడు
ఉదయాన్నే నేను వాడి సమాధిపై కవిత్వం వ్రాస్తాను

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏవో పూలబాసలెడద తలుపు తట్టె
కారణమ్ము నాకు కానరాదు
మధురభావనమ్ము మనసెల్ల విరియగా
విరుల గూర్చి చింత వింత యేమి?

వత్సరములు గడచె భావమన్నది లేక
రసపిపాస యెటనో రాలిపోయె
ఇన్ని నాళ్ళకైన యిదియేమి భాగ్యమో
తలపునుండి నాల్గు పలుకులొలికె

భాగ్యమిది నాదు హృద్భావ వార్ధి నుండి
పొంగి పొరలిన మధురానుభూతి యేమొ!
మధుర భావనామృతధార మదిని నింపి
ముందు నిల్చిన నీ ప్రియమూర్తి యేమొ!

రాగమన్నది లేని నా బ్రతుకునందు
వేయి రాగముల్ వినిపించు వెలది నీవె
కాంతి నిండియునేమియు కానలేని
జీవితమ్మున దీప్తి నించినది నీవె

కొమ్మ చివరన కులికెడు కోయిలమ్మ
అలరు పొడులను మేనెల్లనలదుకొనుచు
పాడుచున్నది తీయని పదములెన్నొ
చెలియ! విన్నచోనికచాలు జీవితమ్ము

*****

# ప్రకృతి యాత్ర

ప్రసాద్ అట్లూరి

ఓరోజు..
నిశీధి భూతాన్నివెలుగురేఖల ఖడ్గంతో
వధించిన వీరుడి విజయ చిద్విలాసం
తూరుపు కనుమల పెదవుల్లో
మెల్లమెల్లగా విచ్చుకుంటూ
తెల్లవారుతుండటం చూశాను

నేలపై వేసిన ముగ్గుల చెట్లపైనుండి
రెక్కలొచ్చి ఎగురుతున్న గొబ్బెమ్మల్లా
ఆకాశ దారుల్లో పక్షుల గుంపులు
డొక్కలకి ఆశల రెక్కల్ని కట్టుకుని
బారులు తీరుతుండటం చూశాను

ఉదయాన్నే మంచు బిందువులతో
ముత్యాల స్నానం చేసిన ప్రకృతిమాత
ప్రశాంత సంద్రపు విశాల దర్పణంలో
తొలిసంధ్యా బింబాన్ని నుదుటిన
సుతారంగా దిద్దుకుంటుండటం చూశాను

కాలం చెల్లిన పండుటాకుల బంధాల్ని
తెంపుకోలేక తల్లడిల్లుతున్న చెట్ల తల్లులు
చిగురుటాకుల నూతనత్వపు అచ్ఛాదనలు
తనువునెక్కడో తాకుతున్న పులకింతలకి
తమని తాము వోదార్చుకోవటం చూశాను

పైరగాలి పాటలకు పరవశించి నర్తిసూ
ఝుంకార నాదామృతాల వెల్లువలో
మైమరచి ఆడుతున్న కుసుమాలు
భ్రమరాలకు తనువులు అప్పగించి
మకరందాలను సమర్పించుకోవడం చూశాను

తీరానికి ఆవల్నీ ఆక్రమించుకోవాలన్న
బలీయమైన వాంఛ చిరకాలంగా తీరక
అల్లకల్లోలమవుతున్న సముద్రుడు
తన అలల పిల్లల్ని అస్తమానం ఉసిగొల్పుతూ
దండయాత్రల్ని కొనసాగిస్తుండటం చూశాను

భూమిలోని అలజడుల పొరల్ని
గుట్టలు పోసుకున్న కొండలు
పరిగెడుతున్న ప్రపంచ పోకడలకి
నిలువెత్తు మౌనసాక్ష్యపు స్తూపాలై
చేతలుడిగి వీక్షించడాన్ని చూశాను

సాయంత్రపు సరదాలకి పరదాల్ని దించి
ప్రియుడ్ని వదల్లేక వదులుతున్న ప్రియురాల్లా
మలిసంధ్యని సాగనంపుతున్న అవని
వివర్ణ విచార వదనాన్ని చీకటి చేతుల్తో
కప్పుకొని బాధపడుతుండటం చూశాను

రాత్రి గూటికి చేరుకున్న జాబిలమ్మ
పాలపుం(ముం)తని కాలం కవ్వంతో చిలికి
వెన్నముద్దల వెన్నెల్ని వెలికితీసి
భూలోకంలో పిల్లలకో ప్రేమికులకో పంచడానికి
వినువీధుల్లో బయల్దేరి రావటం చూశాను

రచించిన దృశ్య కావ్యపు రంగు కాగితాల్ని
మనసు  పొరల్లో ఓచోట భద్రంగా దాచుకొని
ప్రకృతి యాత్రకు ఆనాటికి విరామాన్ని ప్రకటిస్తూ
అలిసిన నా దేహన్ని ధరిత్రి వళ్ళో వాలుస్తోంటే
కళ్ళు తృప్తిగా జోలపాడుకోవటం మొదలెట్టాయి !

★★★



# మౌనం మాట

డా.జడా సుబ్బారావు

మౌనం ..ఎంత భయంకరమో!
ఎదురెదురుగా ఉన్నా
ఎవరో తెలియనట్లు ఏమీ కానట్లు
నోటిని చేతికప్పగించి
చిత్తరువులా చిత్రం చూడ్డం
ఎంత కాదనుకున్నా.. భయంకరమే!!

మనిషే మాట్లాడగలడు
మనిషి మాత్రమే మాట్లాడగలడు
అయినా.. మాటలలో ఏదో లోటు
మనుషుల మధ్య ఎంతో ఎడబాటు
పక్కన మనుషులున్నా..
చూపులు చుక్కల్లోనే! తీగలు చెవుల్లోనే!
పట్టుమని పదిమాటలు మాట్లాడితే
పంచప్రాణాలు కుంచించుకు పోతాయి!
నవనాడులూ బిగించుకు పోతాయి!!

సైగల కాలంనుంచి సాంకేతిక పరిజ్ఞానం
ఇంతింతై వటుడింతై
సృష్టించుకున్న మాటలన్నీ
మౌనపు మూటలుగా మార్చి మూలకు
విసిరేశాం..!
ఇప్పుడు మాట్లాడాలంటే కష్టమే మరి..!
మూలల నుంచీ_ _ _ మూలాల నుంచీ..
మాటలను అరువు తెచ్చుకున్నా
బరువుగా వుంటాయేగానీ బాసటగా అనిపించవు!
మాట.. మనిషిని దగ్గరచేసే మమతల మూట..
కలకాలం నడిపించే జీవపు ఊట..!
నీ భవిష్యత్తుకు బంగారు బాట..!!

★★★



## ఆఖరిశ్వాస
### పంజా

ఎవరి కలో ఈ ప్రపంచం
ఎందుకనో ఈ ప్రయాణం

గమ్య మెరుగని పయనమే అయినా
పయనమే లక్ష్యమనుకున్న బాటసారిని నేను

హటాత్తుగా ,

నా నీడ రూపం మారింది
అది నా నీడే కాదని తెలిసింది

నా విస్తరి లో ఆఖరి ముద్దవు నీవై
ఆకలి తీరుస్తుంటే ,
నీదైన నా ఆఖరి శ్వాస కోసం
నా అడుగుల వడి పెరిగింది

వేగం మార్చుకోని కాలంలో
అర్థం మార్చుకోని అక్షరం లా

నీ చిరునవ్వు ని
కొలువుండి పోనీ .....

****

## ఎంతయినా..
### సంధ్య యల్లాప్రగడ

విషాదం నిషా లాగా అంటుకుంది
ఎంతగా బయట పడాలన్నా వీలుకాకున్నది !

ఆలోచనలు వంటికి చుట్టుకున్న తడి బట్టల్లా అతుక్కు
పోయాయి
ఎంతగా విదిల్చినా వదలవు మనసుని !!

సముద్రంలో అల్లలా ఎగిసి పడుతున్నాయి ఆవేశాలు
ఎన్ని సంత్సరాలు గడిచినా తగ్గటం లేదు!!

రాగద్వేషాలు హృదయాన్ని అంటే ఉన్నాయి అత్తరు లా
ఎంత వయసయినా తగ్గటం లేదు!!!

***



# చిట్లిపోయిన మొలక విత్తనం

కొత్తపల్లి ఉదయబాబు

మెలకువ వచ్చీ రాగానే ఒక మొలకెత్తిన ఉదయం
కనులముందు నమస్కరిస్తూ నిలబడుతుంది...
పక్షులన్నీ మత్తువదలని విక్రమార్కుడి మాస్కులతో...
జీవన వేటకు సాగిపోతుంటాయి...
రాత్రల్లా నిశ్వాసించి చల్లబడిన పచ్చని చెట్లు
కిరణజన్య సం యోగ క్రియ వంటపనిలో పడతాయి...
ప్రశాంతంగా కోడి కునుకుతో సాగుతున్న సెలయేళ్ళు...
పిల్లతెమ్మెర్ల రాకతో కేరింతలు మొదలెడతాయి...
నిప్పులాంటి నిజాలు ఇజాలు
వదులుకుని...వేడెక్కుతున్న
వాతావరణంలో సెటిల్మెంట్ల దారులకోసం
అన్వేషిస్తుంటాయి...
సూర్యుని ప్రయాణం సగం పూర్తయ్యేసరికి
ప్రభుత్వ పచారీకొట్లలో నర్సులకు తెల్లవారుతుంది...
దేవుడిచ్చే వరం కోసం పూజారులు జారత్వపు
శఠగోపాన్ని పిచ్చి భక్తుల నెత్తిన పెడతారు...
నెరవేర్చని వాగ్దానాలు రాజకీయపు
బండపెదవుల వాకిట్లో తారట్లాడుతుంటాయి...
కోట్లను మింగేసే బినామీలు పార్టీల కొంగుచాటున
" చూడు పిన్నమ్మా " ఆటాడుతుంటాయి.
ప్రేమించి ప్రేమను పంచే ఆడది అమ్మగా
నటించేందుకు క్లాప్ కొట్టడం నేర్చుకుంటోంది...
మనిషిగా మరణించిన నాన్న రెండుకళ్ళ
సవారీ బ్రతుకు రంధ్రాన్వేషణ చేస్తుంటాడు...
విలువలన్నీ పుడుతున్న బాల పసిమొగ్గల మానాల
కాపలాకు దవాఖానాలకు చేరుతుంటాయి...
కుటుంబాలు రెల్లుపొదల్లా విచ్చిపోయి...
ఆకాశ హర్మ్యాల రెక్కల్లో ఒదిగిపోతుంటాయి...
కోల్పోయిన మనశ్శాంతి ఫలాలు
ముళ్ళబ్రతుకుల మధ్య
ధనరాసులతో బేరాలకు సిద్ధమౌతున్నాయి...
లేచిపోయి ముచ్చట తీర్చుకున్న యువజంట కొత్త
కోరికలా
రేపటి ఉదయపు ప్రభవంకోసం మరో రోజు
సిద్దమౌతుంది...

★★★★★



# నిర్వచనోత్తర యుద్ధాయణం

డా.నారాయణ గరిమెళ్ళ

ముందే ఆయుధాలు కాజేసే
కుటిల పన్నాగానికి ఆ పేరు పెట్టకు..
గుంట నక్కలనుపయోగించే
హీన ఎత్తుగడలకూ విలువైన ఆ పదాన్ని
వాడేయకు- - -

బుక్కులూ పరాన్న-బుక్కులూ ఒకేలా పలికే
మనుగడ కోసం పోరాటాన్ని
ఈ పదంతో పోల్చి విలువ తీసేయ్యకు
ఆ 'బ్రెడ్ అండ్ బటర్' కి 'కూటికోసం
కోటివిద్యలనే'
వీలున్నప్పుడు
డార్విన్ తో సహా మనమంతా
జంతువులమనే పచ్చి నిజాలమే.

యుద్ధం- - - నిజంగానే
ఒక భగత్ సింగ్ తెగువనో
అల్లూరి ధీరత్వాన్నో
కొమరం భీం పోరాటాన్నో
మండేలా ఉద్యమాన్నో
లూథర్ కింగ్ నల్ల ఘోషనో
సూకీ విప్లవాన్నో
మేధా పాట్కర్ నెత్తినేసుకున్న
సామాజిక బాధ్యత శంఖారావాన్నో
దూబగుంట రోశమ్మ మత్తుమీద కత్తి గట్టి
ఎలుగెత్తిన గొంతునో
జ్ఞప్తికి తెస్తుంటే
వారి తెగువకు అనేక వేల నమస్కారాలు చేసి
తీరవలసిందే...

కానీ.....
యుద్ధం
ఆధిపత్యపు అహంకారాన్నో
ఎడారి బావుల చమురు
కాజెయ్యాలనే నక్క జిత్తుల ఎత్తునో
అభం శుభం తెలియని
ప్రజల మీద విడిచిన
అణుబాంబుల కండకావరాన్నో పైత్యాన్నో
పతిత భ్రష్ట బాధా సర్ప ద్రష్టుల
నిర్భాగ్యం పై ఎత్తిన
అహంకారపు పాదాన్నో
ప్రదర్శిస్తున్నప్పుడు
నిరసన జ్వాలల్ని రగిలించి చూపించాల్సిందే.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నాదు హృదయమ్ము సప్తవర్ణముల తోడ
ఇంద్రధనువుగ మింట శోభించుచుండె
నాదు హృదయమ్ము మృదుల పర్ణముల నడుమ
విరిసి హసియించు సుమముగా వెలుగుచుండె

నాదు హృదయమ్ము గగనసంధ్యారుణమున
వింత సీమల విహరించు విహగమయ్యె
ఇంత యానందమెద నిండెనేలనన్న
నీదు తలపులు మనసెల్ల నిండినంత

వలచితిని నిన్ను యౌవనప్రాయమందు
ఏండ్లు గడచిన నిన్ను ప్రేమించుచుందు
తరుగదీ ప్రేమ నా జరత్వముననైన
అట్లు కాదేని మరణమే యౌను మిన్న

చిన్న తనమున మది నెలకొన్న ప్రేమ
నిలచి యుండును కడదాక వెలితి లేక
జీవితమ్మపుడపుడు నిస్తేజమైన
వెడలి పోదువో నా యెద వీడి నీవు

అక్షరములన్ని తారుమారగుచునుండె
కాలమెల్లను వెనుకకు కదలుచుండె
మరలి వెనుకకు పోవగా మనసు పడుదు
జీవితమ్మెల్ల నిలువగ చిన్న తనము

*****

# ఒద్దిక మరువం ఉష

రోజూవారీ ఘటన:
ప్రవహిస్తూ కాలం, ప్రసరిస్తూ పొద్దుటెండ
బాటపట్టి నేను-కిటికీలోకి పట్టిపట్టి చూస్తూ-
సాదరంగా నవ్వే పాపాయి కోసం

చిన్ని కళ్ళలో
ఒకింత విస్మయం, రవ్వంత కుతూహలం
ఆ ప్రపంచంలోకి ఆహ్వానం

ఇద్దరికీ తీరిక చిక్కితే
నిన్నటి నుంచి నేటిలోకి
పలకమాగిన పలుకరింపులు
చిట్టిపొట్టి మాటల రుచి చెప్పరానంత!

అంతలోనే బిక్కమొగం అందుకునే ఆరున్నొక్కటి
బిత్తరి నా చూపులిక బాట వెంట బిరబిరలు,
పరుగందుకోలేని పాదాలతో

అమ్మవొడి చేరగానే మొలకెత్తే గారాబం, రసవత్తరం
కిటికీ అద్దానికి అతుక్కున్న చిన్నారి హస్తకమలం...!
తుమ్మెదలుగా మారిన నా పాదాలిక అక్కడక్కడే తిరుగాడతాయి.

★★★

# కాలం పాఠం

శిద్దాని

పల్లవి: పరుగే పరువంటూ, సాగుతుఉంటె ఈ కాలం
నిలిచే వీలుందా నీకైనా మరి నాకైనా?
విలువలతో అడుగేసే విధమే మనదైతే
సాహో అంటూ సలాము చేసే గులాము కదరా కాలం అంటే

చరణం: నలుగుతూ సొగసులీనె కాలిబాటర జీవితమంటే
పడిలేస్తూ పల్లవిపాడే ఏటిపాటర జీవితమంటే
మెత్తగా అడుగులు తాకాలంటే
ఒంపులెరుగక నువ్ సాగాలంటే
కాలమొప్పుతుందా? లోకం నిన్ను మెచ్చుతుందా?
పెదవికి నువ్ పట్టం కడితే అందరికి నువ్ చుట్టమె కదరా!
మెరిసే ఊహలు నీవే ఐతే విరిసిన నందనమే కదరా ఈ లోకం!
నవ్వులందరివని నినదిస్తూ! కన్నుల జ్యోతులు వెలిగిస్తూ సాగాలిరా నువ్వు ఓ సోదరా!

చరణం: మృగాల నుండి మనిషిగా మారి వికాసమంటే ఇదేను అన్న నువ్వేనా
మనసులు ఉసురులు తీసే వినోదాలను ఊరక చూసేది
ఎప్పుడిచ్చినదోయి? మౌనం మరో మహోదయానికి ఊతం!
ఎప్పుడొచ్చినదోయి? కన్నీటి దారుల సాగుతూ నవవసంతం
అందుకే నువ్వు దారిని చూపే జ్యోతివి కా!
దారుణాలను దహించే జ్వాలవు కా!

★★★★



## వలస పక్షి
## పి.రామకృష్ణ

రెండు విత్తనాల్నీ
దేవుడు
ఎంతో జాగ్రత్తగా ఒక్కోచోట
పాతి పెడ్తాడా?

వున్న చోటునుండే కదలక
చెట్టేమో
నీడనిస్తుంది.

ఆ కాస్తంత నీడకోసం
మనిషి ఎక్కడెక్కడో
వెతుకుతూనె వుంటాడు.

★★★



## జంట
## హరీష్

నింగి లోని వాన చినుకు మన్నులో విత్తును చేరి
కొత్త జీవితానికి నాంది పలుకుతుంది ,
ఎగసి పడే కడలి కెరటం సేద తీర్చే
తన తోడైన తీరం కేసి పరుగులు తీస్తుంది!

పున్నమి వెన్నెల తన వెలుగుల కాంతిలో
అడివిని అద్భుతంగా ఆవిష్కరిస్తుంది,
రంగుల హరివిల్లు తన అందాలతో
ఆకాశాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుతుంది !

వికసించిన మొగ్గ తన పూయదల పై
తుమ్మెద తాకిడి కోసం తపిస్తుంది,
వసంత ఋతువు ప్రకృతి ఆకృతి మార్చి
పుడమిని ముగ్ధ మనోహరంగా సింగారిస్తుంది!

జత కట్టమని జగమంతా చెప్తుంది
నిత్య సత్యమై ...
ఇది నేర్వక కోరికల చిట్టాతో కుస్తీ పడుతుంది
మనసు మానవ నైజమై ... !!

***

# భ్రమణం

ఎస్.ఎస్.వి.రమణరావు

వినయం నుంచి విజయం

విజయం నుంచి గర్వం

గర్వంనుంచి అహంకారం

అహంకారం నుంచి నియంతృత్వం

నియంతృత్వం నుంచి పతనం

పతనం నుంచి పౌరుషం

పౌరుషం నుంచి పట్టుదల

పట్టుదల నుంచి తపస్సు

తపస్సు నుంచి విద్య

విద్య నుంచి వినయం

వినయం నుంచి........

****



# వెన్నెల తమస్విని

బాల్యంలో వెన్నెల ఓ నేస్తంలా ఉంటుందినీడలు తొక్కే ఆటలు,
ఆరుబయట చందమామని చూస్తూ అపస్వరాల పాటలు.!
కౌమారంలో వెన్నెల అడవి కాచిన వెన్నెల
ఏదో తపన, వెన్నెల వృథా ఔతోందన్న వేదన
నిద్రపట్టని ఎన్నో రాత్రుళ్ళు..
హఠాత్తుగా వెన్నెల ఓ శత్రువౌతుంది..!
యవ్వనంలో వెన్నెల వెచ్చగా ఉంటుంది
కిటికీలోంచి ప్రియురాలి బుగ్గల్ని తడిపే వెన్నెల
కవ్విస్తూ వెచ్చటి నెచ్చెలి ఔతుంది.!
నడివయసులో వెన్నెల గురించిన ఆలోచనే ఉండదు
సంసార సాగరంలో ఈదే వాళ్ళకి తలెత్తి పైకి చూసే అవకాశమేదీ!?
ఆలస్యంగా ఇంటికి వచ్చేప్పుడు ,
ఆకాశవీధిలోంచి 'గుర్తున్నానా?' అని వెన్నెల పలకరిస్తుంది,
చిన్ననాటి నేస్తాన్ని చూసిన ఆనందం
చెప్పులు విప్పి ఇంట్లోకి రాగానే మాయం!!
వృద్ధాప్యపు వెన్నెల ఆధ్యాత్మికం ఔతుంది
ఏరువాక, కామునిపున్నమి, శంకర జయంతి
కార్తీక పున్నమి , బుద్ధ జయంతి మాత్రమే వెన్నెలని గుర్తు చేస్తాయి!
ఐతే
తనలో ఎలాంటి మార్పూ లేని తెల్లని వెన్నెల
పిండారబోస్తూ మనల్ని నెలనెలా పలకరిస్తూనే ఉంటుంది..!

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఆత్మ యీ శరీరముననున్నంత వరకు
నేను నేనుగానుందును నీవు నీవె
ఈవు నేనేయటంచు ప్రేమించుచుందు
ఇరువురొక్కటై ప్రేమ సుస్థిరతనొంద

ఎటుల నా యాత్మ నన్ను త్యజింపగలదు?
ఎటుల నీ యింట తా నివసించగలదు?
ఎటుల నీ యాత్మ వచ్చి నా యింట నిలచు?
ఎటుల నీ మదితోడ యోచింపనెంతు?

రెండు మనసులు వలయును ప్రేమ కొరకు
వలయునిరువురు బ్రతుకున కలసి నడువ
ఇరువురొకటైన ప్రేమించుటెట్టులన్న
రాగసాఫల్యమాత్మసంయోగమందె

వలదు నాకీ శరీరమ్ము; వలదు ద్వయము
విడచి యీ యిల్లు నీ యింట విడిది చేతు
నీ మనసు తోడ కనుగొన నేర్తునెల్ల
నీదు హృదయమె జీవమై నిలచు నాకు

ఐక్యమన్నది ప్రేమ తీరాంతరమ్ము
ఒక్కరై చరియించు సంయోగపథము
ఆత్మలొక్కటై యొక దేహమందు మెలగు
ఎడదలొక్కటియై యొక యింట నిలచు

*****

# ప్రభుత్వోద్యోగి కొత్తపల్లి ఉదయబాబు

**వాడు మనుషుల్లో దేవుడు కాదు...**
మనుషుల్లో కూడా మనిషే కాదు...
పశువులు తోకముడిచేది వాది పేరు విన్నాకనే...
వయసు...వావి...వరుస...వాడి చూపులో
అనైతికం...
గుండెలు చిక్కబట్టుకుని వచ్చే వాళ్ళంటే
వాడి చూపులకు ఎరలు దొరికినట్టే...!
అక్షరమ్ముక్క రాకపోయినా...
కులం కొలువిస్తుంది.....
ఉద్యోగం - " హక్కు " కొడుకుని
చూసుకుని
"బాధ్యత" కూతుర్ని విస్మరిస్తుంది...
కట్టుకున్నదాని సుఖంకోసం -
" లంచం " వ్యభిచారి కొంగు చాటున
చేరతాడు...
నిన్నటివరకు రహదారి అంచులు తడిమిన కాళ్ళు
గమ్యం చేరాకా నడకే మరిచిపోతాయి...

కడుపులో ఆకలిమంటకు గండిపడిన మనసుల
కన్నీళ్ళ వాగులో జార్చుకున్న రక్తపు నోట్లు
నిస్సిగ్గుగా ఏరుకుని
పనికి ఎగనామం పెట్టడం...
సీటు నేర్పిన విద్యేకాదు...నోటు నేర్పిన విద్య కూడా...
కాళ్ళు మోకాళ్ళకు చేరాలే కానీ
వాడి చేయి కదలదు...
ప్రాణం సమాధి అవ్వాలే గాని
వాడి పొరలు కరగవు...
తరాలు చచ్చిపోతున్నా...
భావితరాలు పుచ్చిపోతున్నా
వాడు మాత్రం వేయిపడగల విషనాగుల
నీడలో
పవిత్రంగా పాపాలను చేస్తూ...
తనవారసులను
మోసుకుంటూ...సాగిపోతూ...
సాగి.......పో......................తూ.............................!!!

***



# పసి(డి)కలలు

భవానీఫణి

**పండిన లేత చేతుల్తో**
తన మేని రంగుని సరిచూసుకుంటూ
ఏమారిఉన్న ఆ పెంకు ముక్క,
ఉన్నపాటుగా ఏదో ఒక గడిలోకి
తొక్కుడు బిళ్ళగా విసిరివేయబడి
అదే గోరింటాకు తో ఎరుపెక్కిన
అరికాలి క్రింద నలిగి అలిసిపోతోంది

ఎగిరెగిరి తన్నుతూ తాడాట ఆడుతున్న
పసి పాదాల జంటని
పదే పదే ప్రేమగా ముద్దాడే
పుడమి సహనానికి అచ్చెరువొందుతూ
మైమరిచిన చిరుగాలి,
ఛెళ్ళున తాకే తాడు తాకిడికి
ఉండుండీ ఉలికిపాటుకి గురవుతోంది

తనని పైకంటా విసిరి
నేలమీదున్నతన నేస్తాల్ని
నేర్పుగా అందుకుని
అతి లాఘవంగా తిరిగి తనని కూడా
గుప్పిట చేర్చుకుంటున్న
ఆ మెత్తని చేతి తాలూకూ గాజుల కోలాహలానికి
ఓ చింతపిక్క చిత్రంగా తుళ్ళి పడుతోంది

వైభవంగా జరిగిన తన వివాహ వేడుకకి
సిగ్గిల్లిన ఓ బొమ్మ పెళ్ళి కూతురు,
తనలో జీవమే లేదన్న విషయం మరిచి
చిట్టి పొట్టి పెళ్లి పెద్దల సమక్షాన
చేతనత్వాన్ని కోల్పోయానని
తెగ కంగారుపడిపోతోంది

పగడాలు రాశి గా పోసి
పైన తెల్లని బొండు మల్లె ని గుచ్చినట్టు
ఆవకాయ కలిపిన అన్నం ముద్ద మీద
కూర్చుని ఉన్న ఓ వెన్నముద్ద
మెలమెల్లగా కరుగుతూ
వయ్యారాలు పోతోంది

దీపాల వేళ ఆరుబయట నిలబడి
కొబ్బరిచెట్టు ఆకుల మధ్య నుండి
తొంగి తొంగి తనని చూస్తుంటే
ఎప్పుడో కొబ్బరాకు లో నక్కిన
ఓ వర్షపు చినుకు, నా ముక్కుపైకి దూకిందని
ఆ చిలిపి చంద్రుడు విరగబడి నవ్వుతున్నాడు

ఇంతందమైన కలల పల్లకిలో
నన్నెక్కించుకుని
బాల్యం లోకి మోసుకెళ్తున్న
ఈ బంగారు క్షణాలు
కలిగిపోతాయేమోనని
ఉదయాన్ని సైతం రావద్దంటూ
కనురెప్పల తలుపుల్ని
మరింతగా బిగిస్తున్నాను నేను !!!

★★★

# చీకటి చుక్కలు మహర్షి

నడిరాతిరి చీకటిలో
నలుగుతున్న తారలు
నిసి నిప్పుల్లో
కాలుతున్న కాంతి కాంతలు
ఏకాంత మందిరాల క్రవ్యాదుల
కౌగిలిలో కరుగుతున్న కలికి చుక్కలు
తామసి తలుపుల చాటున
తగలబడుతున్న తారకలు

నింగి నుండి రాలేవి కాదు
నేల మీద రాలుతున్నవి
తప్పటడుగుల్లో తప్పిపోయి కొన్నైతే
తప్పని పరిస్థితుల్లో తప్పక కొన్ని
బలవంతంగా బలైనవి కొన్నైతే
తనవారి ఆశకో,అవసరానికో
ఆహుతై పోయినవి కొన్ని

స్వేచ్ఛాకాశంలో వెలిగే తారలు కాదు
నాలుగు గోడల నడుమ నలిగేవి
కరెన్సీ కాంతికి కలిగే మైనపు ముద్దలు
శృంగార గ్రాహకులకై Exhibitionలో మాంసపు
ముద్దలు

పగటి పతివ్రతా ప్రపంచం వెలేసిన చీకటి చుక్కలు
రాతిరి తీరపు రొమాంటిక్ సముద్రంలోని
సొరలకు ఎరలు,
ఆడతనం వీరి పాపం, అందం వీరికి శాపం
అంతులేని అగాధం
వీరి జీవితం అనుక్షణం నరకం

వెలుగు చూడని వేశ్యలు
కలుగులోని ఎలుకలు
సుఖయంత్రాలు శూలలు
సుత్తికి నలిగే మొలలు

****



## ప్రేమ
## హరీష్

పసితనాన అమ్మ వొడి వెచ్చదనం ప్రేమ,
చినప్పుడు వేలు పట్టి నాన్న దిద్దించిన అక్షరం ప్రేమ,
బాల్యంలో అలుపెరగక స్నేహితులతో చేసిన అల్లరి ప్రేమ,
యవ్వనంలో తన పెదవి చివర ఆగిన చిరునవ్వు ప్రేమ,
ఏడడుగుల బంధంలో ఉన్న బాధ్యత ప్రేమ,
నడి వయసులో భవిష్యత్తు మీద ఆలోచన ప్రేమ,
మలి వయసులో జ్ఞాపకాల పొదరిల్లు ప్రేమ...

****



## కోతల సమయం
## వేణు ఆసూరి

నారు, నీరు పెట్టని వారు
రెక్కలు ముక్కలు చేయని వారు
కోతల సమయం వచ్చేదాకా
పొలాల గట్లే దాటని వారు

పదులో పరకో కూలీ పంచి
పంటలనెత్తుకు పొయ్యేవారు
భుమిని దున్నని ‘భూస్వాములు’ వీరు
ప్రజలే పట్టని ‘ప్రజాస్వామ్యులు’ వీరు

ఇది పంటలు చేతికి వచ్చే సమయం
ఎన్ని 'కలలో' పండే సమయం
ఇది కోతల సమయం
కోతల ‘రాయళ్ల’ కాలం

****



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఎచటకీ పయనమ్మేలనీ ప్రయాస?
ఎంత కాలమీ గమనమ్మిదెన్ని నాళ్ళు?
ఏదియో గమ్యమది కనుపించుచుండు
కాంచునంతలో మరలనగమ్యమౌను

ఎచటకీ బాలుడెటొ పరువెత్తుచుండె?
ఎచటకీ వ్యక్తి వడిగ తానేగుచుండె?
ఎచటకీ ముదుసలి పయనించుచుండె?
క్షణము నిలువక ప్రతిజీవి సాగునెటకు?

ఎచటికో మరి యెందుకో యెరుగలేని
అర్థమే కాని జీవన యానమిద్ది
నిలిపి కాలచక్రమ్మొక నిమిషమైన
విశ్రమింపగ నోచమీ విశ్వమందు

నిలువజాలమెప్పుడును పోవలయునెటకొ
క్షణము నిలువకయుంట లక్షణము మనకు
అనవరతమును పరువెత్తి యలసిపోయి
జీవితమ్మెల్ల తుదకు నిర్జీవమౌనొ!

ఈ నిరంతర బహుదూర యానమందు
మనము మనలనే మరచునీ మార్గమందు
కలసి నా తోడ పయనింప కలసి రావొ!
చేయి జారెడునాత్మ రక్షించుకొనగ!

*****

# చిరుదరహాసం

దీప్తి శ్రీనివాస్ పెండ్యాల

అవటానికి ఆకురాలు కాలమైనా
ఆ అలజడే కనిపించదే ఆ చెట్టులో?!
అక్టోబర్ మాసపు అతిగాలికి ఆకులన్నీ ఆగకుండా
రాలుతున్నా
అద్భుతమేదో జరుగుతున్నట్టు ఆనందంగానే
అగుపిస్తుందే?!
అభినయమా? అతిశయమా?!

చూస్తూనే శీతాకాలపు చలి చిక్కగా కమ్మేసినా
చిరాకైనా కనిపించదే ఈ చెట్టులో?!
చలిధాటికి చిగురంటూ లేక ప్రతీ కొమ్మా ఎండిపోతూంటే
చమత్కారం చూస్తున్నట్టు చక్కగా చిరునవ్వులు
రువ్వుతుందే?!
చిరు దరహాసమా? చిద్విలాసమా?!

మేఘావృతమైన ఆకాశాన్ని చూస్తేనే
మనసుకు దిగులు మబ్బు పడుతుందే మనిషికి?!
మరి మంచు కురిసి తాను తడిసి ముద్దైనా
మురవటమే కానీ వెరపు ను దరిచేరనీయదే ఈ చెట్టు?!
మహోన్నత వ్యక్తిత్వమా? మతిలేనితనమా?!

మదిలోని సంశయం మోహంపైని మందహాసంగా
మార్చి మాట కలిపా
మళ్ళీ అదే చిరునవ్వుతో తన ఎండుకొమ్మలని
సాచింది హిమపాతానికై
మహాద్భుతాన్ని చూసి మాట రాక మౌనంగా మారా ...
మంచి తారకలను మించి ధగధగల
కాంతులీనుతున్న చెట్టుని చూసి!!
మాయాజాలమేమీ లేదు! మంత్రమహిమ కానేకాదు!

మల్లెపూలకన్నా అందంగా కొమ్మ కొమ్మకి నిండిన
మంచుపూలను చూపి
మంచిని చూసే మనసుకి మధనపడే బాధే ఉండదని
మాటాడకనే మరవకూడని సందేశమిచ్చిన చెట్టుని
మనసారా అభినందించి అభివాదాలు తెలిపా!

వెచ్చని వసంతం తెచ్చిన పచ్చని కాంతులతో
విరాజిల్లుతున్నా
వినమ్రతని వదలదే ఈ చెట్టు?
వింతలన్నీ ఒడిసిపట్టిన విజ్ఞానఖనికి వినయం కాక
విజయగర్వాలుండవని చెప్తూ విరిసిన పూవల్లే
నవ్వింది!
వెన్నెల విరజిమ్మేలా! విజ్ఞత విరబూసేలా!!

★★★

# ఆకాశానికి నిచ్చెన

ఆర్.శర్మ దంతుర్తి

దిగంతాలకి దారి చేసాను
ఎక్కుదాం రండి!
చులాగ్గా నడిచిపోవడానికి
ఆకాశంలోకి నిచ్చెన వేసాను
అలా అలా తేలిపోవడానికి
మింటికి బాట చేసాను
కలిసే ఎక్కుదాం, రండి!!

కన్నీళ్లన్నీ గిన్నెల్లో పట్టి
కండరాలన్నీ పిండి కొట్టి
నర నరాల్తో రంగరించి
మెట్టు మెట్టూ కట్టి
తిరిగిరాని లోకాలకి
నిచ్చెన వేసాను
ఎక్కుదాం రండి రండి.

ఆశలన్నీ కలబోసి
కలలన్నీ కరిగించి
బంగారంలాంటి భవిష్యత్తుకి
పైపైకి దూసుకుంటూ
రెక్కలిప్పుతూ ఎగిరిపోవడానికి
దారి సిద్ధంగా ఉంది
రారండి ఎక్కుదాం.

కన్నవాళ్ళని కాదనుకుని
వెనక్కంటూ రాకూడదనుకుని
జీవితమనే పందెంలో
అన్నీ పక్కకి తోసేసి

దూరపు కొండల్ని
నున్నగా నిమరడానికి
అంతరిక్షానికి దారి చేసాను
మరి పోదాం రండి

వ్యయప్రయాసలకి ఓర్చి
జీవితమంతా ధారపోసి
ప్రతి చెమట చుక్కా వెచ్చించి
మింటికి నిచ్చెన వేసాను
వడివడిగా రండి
చేతులు కలిపి ఒక్కొక్కరుగా
కలిసే ఎక్కుదాం రారండి

పైకంతా ఎక్కాకా
చుక్కల్లోంచి కిందకి చూస్తూ
వచ్చినదారిని, కట్టిన మెట్లని
గెల్చిన దరిద్రాలని
తోసేసిన తమ్ముళ్ళని
అట్టహాసంగా చూస్తూ
అహం పెంచుకుని
పగలబడి నవ్వడానికి
రారమ్మని పిలుస్తూ
నిచ్చెన సిద్ధంగా ఉంది
రండి పోదాం
అలుపెరుగని అంతరిక్షంలోకి.

★★★

# మనిషి

ఎం.వి.వి.ఎస్.ఎస్.ప్రసాద్

ఆశగా పిలిచాను 'మనిషీ' అని,
ఆప్యాయంగా పలకరించాను 'మనిషీ' అని,
ఎలుగెత్తి అరిచాను 'మనిషీ' అని,
గళమెత్తి అర్థించాను 'ఓ మనిషీ!' అని,
ఫలితం శూన్యం, ఫలం పూజ్యం!
నా చుట్టు మనుషులు తిరుగుతున్నారు
గుంపులుగా కదలి వెళుతున్నారు
నేనేమీ పొరబడలేదు, అన్నీ మానవాకారాలే!
మరి నాపిలుపుకి బదులు రాదేమి!?
నా అభ్యర్థనకు కదలి రారేమి!?
అవునూ..నేను చూస్తున్న జీవికి భౌతిక లక్షణాలేతప్ప
మనుగడలో మాటలలో మానవత్వమేది!?
'మనీ' 'షి ' కి తప్ప మంచితనానికి విలువేది!?
జాతి లక్షణాలు లేని ఆకారాన్ని చూసి
'మనిషి ' అని భ్రమించడం , మధనపడడం
చిత్తచాంచల్యమేమో!
మానవలక్షణాలు ఏనాడో మంటగలిపి
స్వార్థపు చలికాచుకుంటున్న
రెండుకాళ్ళ జంతువులను
మనుషులుగా భావించడం, మానవులు అనుకోవడం
'మనిషి ' గా ఉన్న నాకు మనుగడ లేదని
తెలుసుకోలేని అవివేకం!

★★★★

# నానమ్మ

శ్రీరమ్యామృత

చిన్ననాటి నుండీ నన్ను మెచ్చిన
వెలుగు కన్నులిక లేవు..
భరోసానిచ్చి భాదమరపించే
బోసినవ్వులిక లేవు..
ఆరువేళ్ళతో అనురాగాన్ని తినిపించే
ఆ అరచేయి ఇక లేదు..
సున్నము ముగ్గని తెలీక
మంచం దిగే ప్రతిసారీ మరపుతో
దూరం దూరంగా నడిచిన
ఆ ముదిపెపు పాదాలిక లేవు..
తొంబై మూడేళ్ల సౌందర్యము
ముడతలుపడిన పసితనము
నాకిక కావాలన్నా కనపడదు..
తెల్ల కుర్చీలో కాలు మీద కాలేసుకుని
ఠీవీగా కూర్చునే నువ్వూ..
పడుకున్నా మహారాణిలా కనపడే నువ్వూ..
గెలుపే కాని ఓటమెరుగని నువ్వూ ..
ఒట్టి ఎముకల గూడుగా
మాంసపు ముద్దగా మారి ..
కాటికెళ్లి బూడిదయిపోయాకా
ఇక ఎక్కడుంటావులే నువ్వు..?
మా అమ్మ గోరికయినా మోలవన్న
నా నాన్న ప్రేమలో తప్ప!

★★★

## (యమ) ధర్మసందేహం

వ్యాకరణం అచ్యుత రామారావు

ఈ రోజెందుకో ఆయాసం ఎక్కువై పోతోంది
కళ్ళన్నీ మసక బారుతున్నాయి
చెవుల్లో జోరీగెప్పుడు దూరిందో
భయంకరమైన హోరుతో బజాయిస్తున్నది
కాళ్ళేమిటిలా తడబడుతున్నాయి చంటి పిల్లాడిలా
కీళ్ళేమిటి పట్టు వదిలేశాయి పగలగొట్టిన ఆట బొమ్మలా
చలిగా వుందా లేక వేడిగా వుందా, ఏసంగతీ తెలియటం లేదే
నా ఊపిరి లోపలకొస్తోందా బయటకు పోతోందా?
అరె రే, అసలు ఊపిరే ఆగి పోయినట్టుందే అకస్మాత్తుగా!
పాతికేళ్ళు వచ్చినా పెళ్ళికాని కూతురు మీద బెంగతో
పక్షవాతం వచ్చి మంచమెక్కిన భార్యామణికేమవుతోందోన నే
భయంతో
భాధ్యతలని పట్టించుకోని నిరుద్యోగి సుపుత్రుడి మీద వెర్రి
మమ కారంతో
లబో దిబో అని కొట్టుకునే నా గుండెకాయ నాకోమాటైనా
చెప్పకుండా
తప్పుచేసి దొరికి పోయిన దొంగలా గుప్చిప్ అయిపోయిందే!
నా చుట్టూ ఎందుకింత వెలుతురు వచ్చేసింది?
ఆ వెలుతురు చుట్టూ అదేమిటా అంధకారం
వాటి రెండిటి మధ్యా ఎవరిదా వికటాట్టహాసం?
నవ్వడానికి వేరే దొరకలేదా వీడికింకో సమయం?
రమ్మని చేతులూపుతూ సైగలు చేస్తున్నాడే
యముడంటే వీడేనా, మరి మీసాలు లేవేం?
కిరీటం ఏదీ, చేతిలో గద కూడా లేదే
దున్నపోతు ఎక్క కుండా
ల్యాండ్ రోవరు మీదొచ్చాడేమిటి వీడు
ఇంగ్లండులో యముడంటే ఇలాగే సూటులో వుంటాడా?
వీడితో వెళితే ఆ ఇంగ్లీషు నరకంలో ఇమడగలనో లేనో!
నా మానవ హక్కులని హుళక్కి చేస్తున్నావని నిందిస్తూ
నా మనోభావాలన్నీ మంటగలిపేస్తున్నావని చిందులేస్తూ
నాకు నమ్మకమున్న మీసాల యముడే కావాలని
భీష్మించి సమ్మె చేస్తానంటే
'అప్పులు సప్పులు చేసి
అర్ధంకాని చదువులేవో చదివావు
ఆ దేశంలో వచ్చే సంపాదనతో అర్ధాకలితో
అలమిటించావు
కడుపు చేత్తో పట్టుకుని
బ్రతుకు తెరువు కోసం బయట పడ్డావు
నాలుగు మూటలు కట్టుకుని
కులుకుతూ వెనక్కెళిపోతాన న్నావు
సుఖాలకి మరిగి అనుకున్నవన్నీమరచి పోయావు
చలిదేశమైనా చాలా బాగుందనుకున్నావు
కన్న తల్లిని కాదని దత్తపు తల్లిని కౌగలించుకున్నావు
పాస్ పోర్టు మార్చుకున్నప్పుడివేమీ నీ బుర్రలోకి రాలేదా
నీ లాంటి దేశ ద్రోహికి
మీసాల యముడెందుకురా ఢింభకా
నీకు నేనే ప్రాప్తం అనుభవించు నోరెత్తకు' అని నా
గొంతు నొక్కేస్తాడా?
లేకపోతే,
టోనీ బ్లెయిర్ దొరగారిచ్చిన హక్కుల చట్టం
అందరికీ ఒక వరం
వచ్చినవాళ్ళకి గూడా కలిపించారీ దేశంలో (యు.కె లో)
మానవ హక్కులు
మళ్ళీ పాస్ పోర్టు మార్చుకోడానికందరికీ వీలుంటుంది
కాని, దాని కోసం ఇండియాలో మరో జన్మ ఎత్తి మళ్ళీ
రావచ్చుని నన్నొదిలేస్తాడా ?

★★★★

# ప్రజాస్వామ్యం

గోవింద చింతాడ

హిరణ్యాక్షుడా, హిరణ్యకశిపుడా ?
ఎవర్ని ఎన్నుకోను ?
రావణుడా, కుంభకర్ణుడా?
ఎవరికి ఓటేయ్యను ?
శిశుపాలుడా, దంతవక్రుడా ?
ఎవరిని గెలిపించను ?

ఓటేమో ఒకటే ఆయే
అవసరాలు నూరాయే
రండి గుడ్డిగా గుద్దేద్దం
ఏ గుర్తయినా ఒకటే .

అయినా ఒక సందేహం
నా ఓటు అక్కడుందా? లేదా ?
వెళ్ళాక తెలిసింది నా ఓటు వేరొకడు వేసాడని !
నా ఓటు పై నాకే హక్కు లేదు
అయినా అది వినియోగించే దిక్కు లేదు
అయినా వేచి ఉంటా మరో ఐదేళ్ళు .
ఆహా ప్రజాస్వామ్యం లో
ప్రజలు ఎంత సౌమ్యమో !!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

కొండ వరుసలపై తోచు నిండు వెలుగు
నిశ్చలతటాకమందు వెన్నెలల యలలు
సృజన చేసి యిరుల తరలించునట్టి
పూర్ణచంద్రబింబము గాంచి పొంగిపోదు

ఈ జగత్తుననెన్నడూహించలేని
అందరానట్టి దివ్యతేజానుభవము
పంచి యెల్లరనానందవార్థి ముంచు
నెలను జూచుచు మరతునీ నేల నేను

నిర్మలానందమునకు సాన్నిధ్యమిద్ది
తనువు ముంచెత్తు నమృతాంశుధార యిద్ది ...
ఏల యీనాడు ధావళ్యమెటకు పోయె
అరుణవర్ణము దాల్చె చంద్రాననమ్ము

ఆంధ్యమిది కాదు తేజమ్ము నైన కాదు
వెలుగు వెలితియౌనరుణంపు వింత కాంతి
అహము రాత్రియు కాదు సంధ్యయును కాదు
ధరణి వేరు రూపమ్మును దాల్చె నేడు

జీవితమ్మున చూతుము స్థితులనెన్నొ
కష్టసుఖముల బహుమనోగతుల మనము
మనకు తెలియని తోచని యనుభవమ్ము
లెన్ని యున్నవో సాక్షాత్కరించునెపుడొ!

**శ్రీ జయ నామ సంవత్సర ఉగాది (మార్చ్ 31, 2014) సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన *19 వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో* ఎంపికైన కవితలు**

# కృతజ్ఞతలు

డా. నారాయణ గరిమెళ్ళ

ఉత్తమకవిత విభాగంలో ఎంపికైన కవిత

మీరు చిమ్మిన విషంతోనే
శస్త్రచికిత్స లకు ఒక నొప్పి తెలియని మత్తు (అనస్తీషియా) దొరికింది.

మీరు విసిరిన ఇటుకలతోనే
తుఫాను బాధితులకు ఇక్కడొక భవనమేర్పడింది.

మీరు ముక్కలు ముక్కలుగా చెక్కేశాకే
ఇక్కడొక అద్భుతమైన శిల్పం ఆవిష్కృతమయ్యింది.

మీరు చల్లిన బురద తోనే
ఈ ఎడారి మొక్కలు విత్తించుకునే భాగ్యరాలయ్యింది.

మీ ఏడుపులు చూశాకే
ఇక్కడి పసిపాపలకు రోదనలంటే రోత కలిగింది.

మీ విరగ బాటు నవ్వులలోనే
ఆహ్లాదకరాలనే వెదుక్కోవాలనే ఆలోచన వచ్చింది.

అందుకే
ఇప్పుడీ వైకుంఠపాళి ఆట
నిచ్చెనలకే కాదు పాములకూ కృతజ్ఞతలు చెబుతోంది.

★★★★

# రహదారిలో గడ్డిపోచలు

డా.మాదిన రామకృష్ణ

ఉత్తమకవిత విభాగంలో ఎంపికైన కవిత

'రా' అంటూ ఆహ్వానించింది ఆత్మ
నాతనువు పై పదాలు వ్రాద్దాం అంటూ
ఏలంటే - మనిద్దరం ఒకటే కదా
నేను తిరోగమించాక
లేక చాలా చాలనాళ్ళు
ఇతరత్రా వ్యాపకాల్తో
నరకమో స్వర్గమోలో
అక్కడి మిత్ర బృందాలతో
పునర్గానం చేస్తూ
భూమి మట్టిని దున్నుతూ
చెట్లూ,గాలీ,నర్తిస్తున్న అలలతో
మోముపై చెరగని చిరునవ్వుతో

ఎల్లవేళలా,కలకాలం
నాపదాల కథిపతినై
మొదట్లోలా ఇప్పుడే ఇక్కడే
ఆత్మకూ శరీరానికీ గానం వెలువరిస్తూ
నాపేరుతో నిర్ధారణచేస్తూ నిష్క్రమిస్తాను!
ఈ చీకటి నిర్బంధములో
ప్రతిఘటన నిరర్థకం!
నాకన్నీ యెరుకే
వెలువరించగలను మరి

నాలోనే ఇతరుల దౌర్భాగ్యాన్ని వీక్షించి
నవ్వుల్లో,చిందుల్లో,విందుల్లో
ఆరగిస్తున్న జనాన్నీ
అలంకారాల దుస్తుల అంతరాంతరాల్లో
కడిగి అలంకరించిన ముఖాల్లో
నిస్పష్టమైన
నిస్పృహ నిరాశలతో దర్శించి
నా అపరాధాంగీకారాన్ని
నిస్సంకోచంగా విన్పించుకునే
భర్త లేడు భార్యలేదు, మిత్రుల్లేరు
ఎవరూలేరు !
''ఇంకో నువ్వు'' మనందరిలో
నక్కుతూ తారాట్లాడుతూ
పారాడే ప్రతిబింబం!
బాహాటంగా బహిరంగంగా
దేనిగురించి మాట్లాడుతుంది ?
తననుగురించి మినహా
(ఇవి జీవితపు రహదారిలో కాళ్లకు తగిలే
గడ్డిపోచాలలాంటి ఊహలు. ఏవీ అట్టే జ్ఞాపకము
ఉండవు).

★★★★

# స్వేదం

భరత్ భూషణ్ రెడ్డి

ఉత్తమకవిత విభాగంలో ఎంపికైన కవిత

ఆకలి దప్పుల వేదం స్వేదం.
అణువణువున వుబికిన శ్రమ జీవన మాధుర్యం
స్వేదం.

రుధిరపు ఇంధనం మరిగినపుడు
ఆవిరి ఐన శక్తికి ద్రవరూపం స్వేదం

ఊహల కొలిమిలో ప్రకృతిని కాల్చి కాల్చి
సమ్మెట పోటుతో చదును చేస్తున్నపుడు
మనిషి నుదుటన పొడచే గెలుపు గర్వం స్వేదం

పోటెత్తిన కెరటాల్లాంటి రెండు తనువులు
ఎగసి ఎగసి, పోరి పోరి,
చివరగా ఒకరిలో ఒకరు ఒదిగి, సంధి
కుదుర్చుకునే సమయంలో విసరబడ్డ
మధురానుభవ చినుకులే స్వేదం

పురిటి పడక పై పిడికిళ్ళు బిగిసినపుడు
పిండిన జీవోద్భవన అద్భుతం స్వేదం

మనుగడ పోరాటంలో పరుగెత్తి పరుగెత్తి సేద తీరే
సమయంలో,
నుదుటి నుండి రాలిన మరో ఘడియ జీవనపు
ఆశావాదం స్వేదం

జీవన సమరంలో ప్రత్యర్థి పై కురిపిన ముష్టిఘాతపు
అంచుపై
ముత్యమల్లే జారే విజయపు దరహాసం స్వేదం

ఆహ్లాద సాగరంలో ఓలలాడుతూ,
ఆనంద పరవశంలో ఊయలూగుతూ
నటియించి, నటియించి, అలసి పోయిన తనువుల
అందంగా మెరిసే తన్మయపు ధారలే స్వేదం

మధువు కన్న మధురం స్వేదం
మనిషి జీవన మర్మం స్వేదం

****

# తాళం

కామేష్ పూళ్ళ

నా మొట్టమొదటి కవిత విభాగంలో ఎంపికైన కవిత

నాకు నచ్చినవి అన్నీ పోగేసి

ఒక పెట్టెలో పెట్టి తాళం వేసా!

అలాంటి పెట్టెలన్నీ పోగేసి

ఒక గదిలో పెట్టి తాళం వేసా!

అలాంటి గదులన్నీ ఒక ఇంట్లో పెట్టి

తాళం వేసా!

ఈ మూసిపెట్టే, కప్పెట్టే తాళాలన్నీ తెలివిగా జాగ్రత్త చేశా గాని

నన్ను నేను తెరుచుకునే తాళాన్ని మాత్రం

ఎక్కడో, ఎప్పుడో పారేసుకున్నా!



# నేనొక విహంగమై

చెన్నూరు నరేంద్రనాథ్

నా మొట్టమొదటి కవిత విభాగంలో ఎంపికైన కవిత

విశ్వ వినీలాకాశ ములో నేనొక విహంగమై
విమానాలతో పోటీ పడి రెక్కలాడిస్తూ ,
అటూ ఇటూ ఎగురుతూ,
కడలి తరంగాల కంటే వేగంగా పయనిస్తూ
మేఘాల మధ్య ఓ వేగు చుక్క లా,
ఇంద్ర ధనస్సుల మధ్య ఓ రామచిలుకలా,
సూర్య భగవానుని కనుసన్నలలో
ఓటమి ఎరుగని విద్యుల్లతలా
విహంగ వీక్షణం చేస్తూ ,
నదులు, సరస్సులు సాగరసంగమాలు దాటి
అలుపెరగని పయనంతో
క్రమశిక్షణ గల ఓ వీర ధీర మహా సైనికునిలా
సూర్య చంద్ర నక్షత్రాల సాక్షిగా మెరుపుతీగనై ,
మెరుపు వేగం తో ఉరుములు మెరుపుల
మధ్య ఎండవానలను లెక్క చేయక
ఆకాశంతో స్నేహం చేస్తూ,
వాయుభగవానుని ఆశీస్సులతో
సప్త సముద్రాలు దాటేస్తూ,
అన్య పక్షుల కిలకిలారావాలతో
కారడువుల పై అవలీలగా పయనిస్తూ ,
సీతాకోకచిలుకల చిరు సవ్వడుల మధ్య
అరుణారుణిమ ఆకాశాల మధ్య
స్వేచ్ఛ అనే భంగిమ తో
పగలూ రాత్రిని దాటేస్తూ,
అలుపెరగని పయనంతో
ఆనందంగా రోజులని గడిపేస్తూ
విహంగ వీధులను వీక్షిస్తూ,
పక్షులను ప్రేమతో పేరు పేరున పలకరిస్తూ
రెక్కల సవ్వడి తో అందరిని మేలుకొలుపుతూ
ఇంద్రలోక, చంద్రలోక పథ సన్నిధిలో సేవ చేస్తూ
సుప్రభాత సమయాన పరమాత్మ సన్నిధులకు
పుష్పములు వెదజల్లుతూ, అర్చన చేస్త
భూ మాత ప్రదక్షిణాలు చేస్తూ
అలుపెరగని విహంగమై,
రంగురంగుల మధ్య పయనం చేస్తూ
మధ్య మధ్య పూదోటలలో హాయిగా విశ్రమిస్తూ
తిరిగి విహంగ వీక్షణానికి పూనుకొని
పైనుంచి మనుషులను వీక్షిస్తూ,
అన్యాయఅక్రమాలకి దూరంగా
కాకులనే ఏకాకులతో స్నేహం చేస్తూ
సుదూర స్వప్నాలకి సుందర పయనం చేస్తూ
దేశ విదేశాల కి అత్యంత సునాయాసంగా
మహా పర్వ దినాలని వీక్షిస్తూ పయనం చేస
శ్రీవారి సన్నిధిలన్ని అత్యంత వేగంగా దాటేసి
కాలమనే మహా సముద్రాన్నినెమ్మదిగా వీక్షిస్తూ,
ఆనందంతో అనుభవిస్తూ,
ఉల్కలని, వేగుచుక్కలని, తోకచుక్కలని, చుక్కలని
దాటు కుంటూ,
అత్యంత వేగంగా పయనిస్తూ
అనంత శ్రేణిని దాటుకుంటూ,
ఆకాశం అనే మహాసముద్రాన్ని
అటునుంచి ఇటు
ఇటునుంచి అటు దాటుకుంటూ,
పాపపుణ్యాలని బేరీజు వేస్తూ,

శివసాన్నిధ్య మహిమా శక్తితో
సర్వసంగపరిత్యాగినై,
సర్వమత ప్రార్థనలని వీక్షిస్తూ పక్షులమధ్య ఓ పక్షినై,
భగవానునికి ఓ దూతనై
శాంతికి చిహ్నంగా, సార్వభౌమాధిపత్యానికి దూరం
భాష తెలియని భాషతో అరుస్తూ,
నా ఆవేదనని వ్యక్తపరుస్తూ,
భగవానునికి ఓ సందేశంగా తెలియ
జేస్తూ , మానవాతీత శక్తితో అత్యంత శక్తివంతమైన
నా చూపు తో,
మానవలోకాన్ని పై నుంచి వీక్షిస్తూ
అరణ్యాలని దాటుకుంటూ,
పక్షి రాజులకి ప్రణామాలు చేస్తూ,
ఓ వినమ్ర సేవకుడినై
ఉదయరవికిరణాలకి
నమస్కరిస్తూ
వాయువేగంతో కడలిని దాటుతూ
పర్వత శిఖరాలని
దాటుకుంటూ
ప్రపంచ వీధిలో ఓ పరిమళ పుష్పాన్నై
రంగురంగుల రెక్కలతో నీలాకాశములో తెల్లటి
మేఘాల మధ్య ఇంద్రచంద్ర లోకంలో
ఓ సుందర విహంగాన్నై సేవ చేసి తరిస్తూ,
శ్రీ శ్రీనివాసుని మహా సన్నిధిని
వీక్షిస్తూ,
పగలు రాత్రి అలుపు లేకుండా స్వామి వారి సేవ
చేస్తూ,
పుణ్య సంపాదనే మార్గంగా
ఆకాశంలో మెరుపు తారనై గమ్యాన్ని దాటేస్తూ
బంగారు రంగుల ప్రపంచంలో నాకు నేనే
సాటిగా దూరాన్ని అధిగమిస్తూ

,విహంగ ప్రతినిధిగా ప్రపంచపయనం చేస్తూ
విష్ణు భగవానుని సేవలో ఓ చిరుజీవినై
స్వామివారి జపం చేస్తూ,
పూలహారాలని వెదజల్లుతూ సుగంధాలతో
గంధర్వుల ప్రపంచాన్ని అధిగమిస్తూ,
రవి ఎరుగని ప్రపంచాలని
దాటేస్తూ,
మానవ ప్రపంచానికి దూరంగా ఎవ్వరికి
అందనంత ఎత్తులో, విశ్వ విపణి విమానాలతో,
ధనమహిమ లేకుండా,
అనుమతి అవసరం లేని నా ప్రపంచంలో
ఏ కులమత భేధం లేకుండా,
ఏడు రంగుల స్వప్నాలతో స్నేహం
చేస్తూ, విల్లు విడిచిన బాణమై
లక్ష్యాలని దాటుకుంటూ,
సుదూర ప్రయాణంలో ఓ సుగ్రీవుడినై
వాయు పుత్రున్ని జపం చేస్తూ,
భగవన్నామ స్మరణ తో
పక్షుల కిలకిలారావాల మధ్య సాగరాలని
దాటుతూ తియ్యని కోకిల స్వర మాధురి వింటూ
ఆనంద సాగరంలో తేలియాడుతూ
జగన్నాధుని వింత లీలలు చూచి
తరిస్తూ , సుగంధాల నడుమ ఓ గ్రంధాన్నై,
కాలమనే పుస్తకాన్ని చదివేస్తూ,
ద్వేషానురాగాలకి దూరంగా పయనిస్తూ
విహంగరాజ్యాన
అలుపు లేకుండా నిస్వార్థజీవినై, పుణ్య
క్షేత్రాలమీదుగా పయనిస్తూ, ప్రకృతి
పులకింతలతో, నెమలుల నాట్యాన్ని వీక్షిస్తూ
ఓ విహంగమై ఆకాశానికి అటూ ఇటూ
పయనిస్తూ!! ★★★★★

# రొమాన్స్ చచ్చిపోయింది

శివ్వాల గోవిందరావు

నా మొట్టమొదటి కవిత విభాగంలో ఎంపికైన కవిత

ఇదివరకెప్పుడైనా
రోడ్డు మీద అమ్మాయి పోతుంటే
ఆమె కళ్ళు కలువపూల రేకుల్లా ఉన్నాయనో
ఆమె మోహం చంద్రబింబమనో
ఆమె నడక హంస నడకనో
నడుము ఉందో లేదోనన్న భ్రమతోనో
ఇంకా కొన్ని ఉపమానాలతో
మనసులో మెచ్చుకుని
ఆరాధనలతో అర్చనలు చేసి
ఆమె చూపుల కటాక్షాలు పడాలని ఆరాటపడుతూనో
విరహపు ప్రేమమైకంలో తేలియాడి....!!
కాని నేడు -రొమాన్స్ చచ్చిపోయింది
రోడ్డు మీద అమ్మాయి పోతుంటే
ఆ కళ్ళలో కనిపించే ఒక భయంతో,
జుగుప్సతో అసహ్యంతో నిండిపోయినట్లున్న చూపులతో
అభద్రతాభావంతో, అలా చూస్తే ఎలా ఉందో
ఉన్మత్త ప్రభావంతో ఉదాత్తత ఇలా తలదించుకుని
మన మీద మనకే అసహ్యం కలిగి, విరక్తి కలిగి
మనమేనా? మన ఆరాధనలో, ప్రేమలో
ఇవే ఉన్నవా అనిపిస్తే -ఇక రొమాన్స్ చచ్చిపోతుంది
భావకవుల ప్రేమగీతాలు, గీతాంజలిలు
జయదేవుని అష్టపదులు, కాళిదాసు
కమనీయ ఉపమానాలు, బుద్ధుని బోధలు
గాంధీ సిద్ధాంతాలు , రవీంద్రనాథ్ ఠాగోర్, దేవులపల్లి,
చలం ..! -మీరంతా ఎక్కడ?
అమ్మా భరతమాత!
మమ్మల్ని నపుంసకులుగా పుట్టించమ్మా! ★★★

# మొదటి కవిత

కర్రి రఘునాథ శంకర్

నా మొట్టమొదటి కవిత విభాగంలో ఎంపికైన కవిత

నీ స్నేహం కోరి , కవిగా నేమారి
రాస్తున్నా మొదటి కవిత!
నీ ఒంటి సొంపులను మాటలకెంపులతో వర్ణించే
ఉద్దేశ్యం ఉన్నప్పటికీను
నీ కన్నులను, చెంపలను, పెదవులను
గులాబీపూరేకుల సోకులతోను
నీ కంఠమును శంఖముతోను,
చంద్రున్నే నీ ముఖముతోను
నీ నవ్వును మరుమల్లె జల్లుతోను,
సిరి మువ్వల ఘల్లుతోను
తిరగబడిన హరివిల్లుతోను కనీసం సినీవాలితోనైనా
పోల్చి పొగడలేనే! నే గొప్ప కవిని కానే!
ఇది నా మొదటి కవిత
నా స్వప్నం! నీ స్నేహం! నీ స్నేహం! నా స్వప్నం!
నిలకడగా నిలవలేక వడివడిగా నడవలేక
కుడిఎడమలుగా విడువడిన ఆలోచనలపై
అదుపులేక
వలపుల తలపులు, తలపుల పొలికేకలు ఆపలేక
మొహమాటం వీడి,తగుతరుణముకై వేచి
గ్రహబలం చూసి ఊపిరి బిగబట్టి
నీ ముందు నా మనసును ఏకరువు
పెడదామనుకుంటే
మాటలు తడబడి గొంతు పొలమారింది.
అందుకే రాస్తున్నా మొదటి లేఖ
నాతో నేనే చెప్పుకున్నా!?
నీ తాహతుకి సరిపోతానా...?
ఆశకు హద్దుండాలి.
మనిషన్నాక బుద్ధుండాలి.
చింపెయ్యనా.. ఈ కాగితాన్ని?
చంపెయ్యనా నా వాంఛని?
ఆశైతే ఆగిపోదును శ్వాసని ఆపడం ఎవడి తరం.
నీ పేరుతో నా పేరుని ఎన్ని సార్లు జతచేర్చి సరిపోల్చి
చూసానో
బియ్యపు గింజలపై, తపిక్కలపై,నోటుబుక్కులపై
రాసానో -గుండెల్లో నిండావు
నా అభ్యర్థనని చదివి
మండిపడతావో? చీల్చి చెండాడుతావో?
సరేనంటావో..?నువ్వు నాకు తగవంటావో..?
ఏదైనా సూటిగా చెప్పేయ్.. నేనజ్ఞానిని, పసివాడిను
నీ చూపుల భాషలను అనువదించలేను
నీ మాటల ఆంతర్యం గమనించలేను
నీ నవ్వుల రహస్యం ఛేదించలేను
నా స్వప్నం! నీ స్నేహం! నీ స్నేహం! నా స్వప్నం!
నీ నవ్వులకు నే కారణమవ్వాలని
నీవు మాటల సందులో నా పేరొక మారు తలవాలని
నువ్వు చూపులు పరికించి నాకై వెతకాలని
నీ అధరములాట నాతో, నీ కౌగిలిలో నేను
కనీసం నీ ఊహలోనైనా నేనొక్కమారుండాలనే
నా స్వప్నం - నువ్వంటే నాకిష్టం
నా స్వప్నం! నీ స్నేహం! నీ స్నేహం! నా స్వప్నం!

నే కవిని కాను పదాలను పేర్చి పద్యాలుగా మలచలేను

నటుని కాను హావభావాలు ముఖాన పలికించలేను

కథకుడిని కాదే! మాటల మతలబులు చేసి నమ్మించలేను

రసికుడను కానేకాదు నా అభిరుచులు, అలవాట్లు గొప్పవేం కాదు

ప్రేమికుడను అనుకుంటావేమో

ప్రేమకి, వ్యామోహానికి తేడా నేనెరుగను

ఇది నా మొదటి ప్రేమ

నువ్వంటే నాకిష్టం

నీ స్నేహం! నా స్వప్నం!

నీ కన్నులు కోరిన, చూపులు చేరిన బాటలే

ముల్లున్నా, మరేమున్నా నా మార్గం

నీతో చెప్పాలని నే రాసుకున్న మాటలే

అక్షరదోషాలున్నా, యతి ప్రాసలు లేకున్నా నా కవిత్వం

ఎగజిమ్మే, విరబూసే, నీ హృదిన పొంగే నవ్వులే

అడ్డంకులెన్నున్నా, అవాంతరాలెదురైనా నా గమ్యం

నీ స్నేహం! నా స్వప్నం!

నీ స్నేహం! నా స్వప్నం!

నా స్వప్నం! నీ స్నేహం!

నా స్వప్నం! నీ స్నేహం!

★★★★

# నా యుగం

మల్లిపూడి రవిచంద్ర

యువతరం విభాగంలో ఎంపికైన ఉత్తమ కవిత

కాలపువాకిట్లో ఎర్రని గిరిగీయడానికి
ప్రపంచానికి ముందే మేల్కొన్నాడు
పాశ్చాత్యసూర్యుడు
నాయుగం మాత్రం
సాయంత్రం గొంతులో చిక్కుకున్న వేకువను
వెదకడానికి
ఇప్పుడిప్పుడే మేల్కొంటోంది.
పాశ్చాత్యుడి ఇంటి కాంతికి
ఇంట్లో ఉన్న దీపాన్ని ఆర్పేసుకుంటోంది.
పరసంస్కృతి పరిష్వంగంలో చల్ల 'ధనం' కోసం
అటునుంచి వీచే గాలితో జోలి నింపుకోవడం కోసం
వెర్రిపడగలెత్తి మనసునంతా విస్తరిస్తోంది.
చలువకు మరిగి,
పచ్చకామెర్ల చందాన
పాలిచ్చి పెంచిన కన్నప్రేమను మండుటెండలో
కుంపటిపాలు చేస్తోంది.
అయినా...
ఆనందబాష్పాలనే వర్షిస్తూ అందులోనే కలువలై
వికసిస్తున్న కళ్ళకు దాసోహమైపోతోంది.
జలతారు వెన్నెల్లో
కోల్పోతున్న వెలుగుల పోగుతో మళ్ళీ '**సినీ**'వాలినే
తయారు చేస్తోంది.
జెనరేషన్ ప్రభావం చేత
బాగా '**డిస్టర్బ్**' అయ్యి
కొక్కొరొక్కోలు, కుహూకుహూలు మాని
ఉదయాన్నే '**కెవ్వుకేకలు**' వేస్తోంది.
పేదరికాన్ని తనువెల్లా అనుభవిస్తూ...
చిట్టి పొట్టి గుడ్డలతో సరిపెట్టుకుంటూ
ఆత్మాభిమానం అడ్డురాగా ముఖాన '**స్కార్ఫ్**'
కట్టుకుంటోంది.
డబ్బులిస్తేగానీ ఏ పనీ జరగని ఈ రోజుల్లో
బస్సుల్లోనూ, రైళ్ళలోనూ '**జాకీడ్రాయర్ల**' ప్రదర్శన
ఉచితంగా మొదలుపెట్టింది.
చదువు '**కొనడం**' మొదలయ్యాక
అజ్ఞానపుటంధకారాన్ని మెదడు అరల నిండా
నింపుకుంటోంది.
బతకడం చేతకాని బడిపంతుల్లా..
ఉద్యోగపుటెండమావిలో నీటిని చేదుకుంటోంది.
అక్షరబీజాలు పడక
విద్య పండని బీడునాలుకలను
నూత్న వినూత్నంగా సాగుచేస్తోంది.
కులపు పచ్చ
నుదుటిపై చెక్కించుకుని ఆధిపత్యావశేషాలను
శ్మశాన పర్యంతమూ కొనసాగిస్తోంది.
పెద్ద నోరు చేసుకొని
మన్నును, ఇసుకతిన్నెను, ఎకరాల ఎకరాలను
ఆరగించేస్తోంది.
ఘనులంత మెచ్చే
గనులన్నిటినీ పుష్పకవిమానాల్లో
తరలించుకుపోతోంది.
దేన్నైనా సృష్టించగల
సాంకేతికయుగంలో కోటానుకోట్ల దేవుళ్ళను
సృష్టిస్తోంది.!

బతకడం బాగా నేర్చి
మితిమీరిన గుడ్డినమ్మకపు పునాదులపై
చీకటి ఆశ్రమాలను నిర్మించుకుంటోంది.
సమజ మనోరథాలపై
నిర్వి'**రామం**'గా '**నిత్యానందం**'తో ఊరేగుతూనే ఉంది.
ఎన్ని చేసినా!
ఎంత చేసినా!!
పేదరికానికి సిసలైన చిరునామాగా..
మానవత్వానికి ప్రశ్నార్థకంగా...
శకాలు విసిరేసిన శకలంగా మిగులుతూనే ఉంది.



# అడవిలా..

ప్రసూన రవీంద్రన్

యువతరం విభాగంలో ఎంపికైన ఉత్తమ కవిత

అడవి మనసుని
కొంతయినా అర్థం చేసుకోవాలి
మొరటు చెట్టుని ప్రేమగా హత్తుకునే తీగల్లాగో ...
సెలయేటి ఒంపుసొంపులన్నీ సొంతమైనా
మోహాన్ని కనపడనివన్ని బండరాళ్ళలాగో ...
కాసేపు మారిపోవాలి.

అడవి అందాన్ని
కాసేపైనా అరువు తెచ్చుకోవాలి.
ఇన్నేసి ఉదయాల్ని
అద్భుతంగా చిత్రిస్తున్న కిరణాల కుంచెల్ని
ఒడుపుగా పట్టుకున్న ముని వేళ్ళకి
మనసారా మ్రొక్కి రావాలి

అడవి స్థితప్రజ్ఞతని
కాస్తయినా అలవర్చుకోవాలి
కాలం ప్రతి ఋతువునీ దోచుకుని
కౌగిట్లో కరిగించేస్తున్నా
నిరాశ నీడల్ని తరిమికొట్టే
నిబ్బరత్వాన్ని పొందాలి.

అడవి వినయశీలతని
ఇసుమంతయినా నేర్చుకోవాలి.
రాత్రి చెప్పిన పాఠాలు విని
ఆత్మ పరిశీలన చేసుకుంటూ
మలి ఉదయానికి
నన్ను నేను పునర్నిర్మించుకోగలగాలి.

తిరిగి తిరిగి పాడుతున్న
వెలిసిపోయిన పాటల్ని
ఇవాళ బహిష్కరించి
కాసేపయినా ...
అడవిలా ఆకుపచ్చగా పాడుకోవాలి.!



# నిర్భయ

హరీష్ గొర్లె

యువతరం విభాగంలో ఎంపికైన ఉత్తమ కవిత

తాను స్త్రీ అని
పాదం ప్రపంచం ముంగిట్లోకి
అడుగేసే క్షణం
ఒక్కసారిగా ఉలిక్కిపడి
భయం తడిమేస్తుంది
ఆ తలపుల తడి తెరలుగా
నిస్సహాయతను వెక్కిరిస్తుంది . .
రాలిపోతున్న స్వాతంత్ర్యాన్ని
అందుకోవాలన్న తపన
సిగ్గుపడి ఆహార్యం భద్రపరుచుటలో
బందీయైపోయింది ....

నారి లేని నరుడు
నాగరికతను లిఖించగలడా ..?
క్రూరత్వం కట్టలు తెంచుకుంటే
నడయాడే రక్తపు బొట్టులో
ఏ ప్రతిబింబాన్ని చూడాలి ?
ఈ సమజాన్నా..? ఈ నాగరికతనా..?

ఉన్నానని , విన్నానని
ఉరికే ఉండనీక
చలించిన సాహిత్యం అక్షరాన్ని బలికిస్తుంది ..!!
చదివేది మనిషైతే మారతాడని
మనస్సైతే సమాజాన్ని మారుస్తాడనీ .. !
రక్షణ ఏచ్చుకుని రవ్వంత ధైర్యం రాసి
కాగడాలనందించి స్త్రీ ని ఆహ్వానించాలి!!

★★★★

# ప్రవహిస్తూనే ఉంటా..

దోర్నాదుల సిద్ధార్థ

యువతరం విభాగంలో ఎంపికైన ఉత్తమ కవిత

ఎప్పుడో ఎక్కడో
ఈ దేహంలోకి నేను
ప్రవహించాను.
నేనంటే...?
నేను ఈ ఇరుకైన దేహంలో
ప్రవహించలేకపోతున్నాను
శరీరపు హద్దులను
ఒరుసుకుంటూ, గాయపడుతూ
మెదడుకు, గుండెకు మధ్య
నలిగిపోతూ ప్రవహించలేను
ఈ దేహం నుండి బయటపడి
ఆత్మ విస్ఫోటనం చెంది
భూమంతా ఆకాశంలా వ్యాపించాలి
ప్రతి హృదయంలో నా శకలాలు
బీజాలై మొలకెత్తాలి
పాషాణ హృదయాలను
కరిగించే లావాలా నేను ప్రవహించాలి
మనుషుల ముసుగులు లాగే
హోరు గాలై ప్రవహించాలి
ప్రపంచీకరణపై
కలముల కత్తులు దూసే
మనుషుల మనసులలో
భావాన్నై ప్రవహించాలి
శత్రువుల గుండెలు చీల్చే
గుండెలో ధైర్యమై ప్రవహించాలి
ఎదుటివాడి కష్టానికి
కదిలే మనిషిలో
కన్నీరై ప్రవహించాలి
మనసును మనిషికి జోడించే
సంజీవనినై ప్రవహించాలి
చెట్టు, నీరు, గాలి
సమస్త ప్రాణి లోకాన్ని కాచే
కారుణ్యపు కాంతినై ప్రవహించాలి
మేధను, హృదయాలను కలిపే
మార్గాన్నై ప్రవహించాలి
ప్రతి దేహంలోకి
మానవత్వపు ఉచ్ఛ్వాసై
గుండెల ప్రేమ నింపి
స్వార్థాన్ని తోసే నిశ్వాసై ప్రవహించాలి
ఎదుటి వ్యక్తిలోని నిన్ను చూసి
నువ్వు భయపడకుండా
అంతా నేననే నిజాన్నై ప్రవహించాలి
ప్రపంచ శాంతి పాటకు
పల్లవి నేనై
నాతో వచ్చే చరణాలను
కడిగే గంగై ప్రవహించాలి
ఏదో ఒక రోజు
ఈ దేహం పడిపోతుంది
కానీ... నేను...
కోట్ల దేహాలలో
ప్రవహిస్తూనే ఉంటా..... !! ★★★

# మళ్ళీ రాయాలి మలిపి మరో కొత్త గీతం

నాగరాజు రామస్వామి

ఈ ఉదయం ---
గాలి ఒక ఈల పాట !
నేల ఒక పద్య పాదం!
నింగి భావాంబరం!
సంద్రం స్వరార్ణవం !
సృష్టి ఒక దృశ్య కావ్యం !
సర్వం రసరమ్యకవిత్వం!

అదిగో, అందుకే
ఆ రసావేశంతోనే నేను అక్షరం అయింది!
ఆలోచనకు అంబుదాలను అలది
పద్యానికి పక్షి పాదాలను అతికి
పాటకు పవన పక్షాలు తొడిగి
ఎగిరేశాను నా గీతాన్ని ఆకాశంలోకి
రెక్క విప్పే లిక్క ఔతుందని !

కాని, నా కవిత
గువ్వపిట్ట లా ముడుచుకుంది
గూటికే పరితమయింది
శూన్యాకాశం పాటను పరిహసించింది!
నా అక్షర విహంగ సృష్టిలో
ఏదో జీవద్రవ్యం లోపించి ఉంటుంది
గుప్త జీవన ధాతువేదో లుప్తమై ఉంటుంది
అంగరాగమే తప్ప ఆత్మస్పర్శ కొరవడినట్టుంది
ప్రాణప్రతిష్ఠ చేయడం నేను మరచినట్టుంది
అస్మితాసంకుచితమైన నా అక్షర రేఖ
అనంత కళాత్మకు హద్దులు గీచినట్టుంది
అందుకే
సృష్టించుకోవాలి మరో సృజన ప్రాణ పతంగాన్ని,
రెక్క సాచని నా అక్షర వర్ణాల అచల జీవన చిత్రాన్ని
మలిపి మళ్ళీ రాసుకోవాలి మరో కొత్త గీతాన్ని !

★★★

# మేలి ముసుగులు

అల్లూరి గౌరీలక్ష్మి

అందంగా అల్లిందేదైనా బావుంటుంది
స్వెట్ట రైనా , కథైనా, కవితైనా
అష్ట కష్టాల అల్లిక మాత్రం అందంగా ఉండదు !
తన్ని తాను కాల్చుకుంటేనే కళ పుట్టుక
మెదడు పిండి శ్రమిస్తేనే పరీక్ష ల గెలుపు
హృదయం నలిపి లిఖిస్తేనే కథనాలు
ఎన్నో దు:ఖాల మింగుదలే తెరపై బొమ్మ
కఠోర శ్రమ తోనే హస్త కళాకృతి
ఆటు పోట్లు అధిగామించాకే విజయ కిరీటం
అనుకోకుండా రాసిన నవల బుకర్ ప్రైజ్ తేలేదు
పిలిచి సినిమా పాత్ర ఇస్తే నంది అవార్డు దొరకదు
నిరంతర తపనతోనే కళా సృజన వెల్లువ
ముఖ ముఖీ పరిచయాల్లో మాత్రం
అలవోకగా అయిపోయామని స్టార్ లంటారు
పడ్డ కష్టా లన్నింటికీ రంగుల కవరేస్తేనే
వినసొంపూ, కంటి కింపూ జనానికి
అందంగా అల్లిందే దైనా బావుంటుంది
పూల మాలైనా, పూబోడి జడైనా
అష్ట కష్టాల అల్లిక మాత్రం అందంగా ఉండదు !!
పూల పక్కన ముళ్ళూ , జట్టు చెక్కిన నొప్పులూ
చెప్పకెప్పుడూ... వినే వాళ్ళకు వెగటు
కఠిన నిజాలు వినే శ్రోత లుండరు
అందుకే బ్రతుకు పోరుకు గైడ్ లుండరు
అబద్ధాల అల్లికలే జిలుగు వెలుగులు
అవి సొగసైన మేలి ముసుగులు
అందంగా అల్లిందే దైనా బావుంటుంది
అష్ట కష్టాల అల్లిక మాత్రం అందంగా ఉండదు!!!

★★★

# దేహచరిత్ర

రేణుక అయోల

ఉద్యమాలు చేసిన దేహాలైనా
శ్రమించి చెమట బిందువులు రాల్చిన దేహాలైనా
శరీరాన్ని అమ్ముకున్న దేహమైనా
ప్రతీసారీ స్పర్శించుకుంటూ సంభాషిస్తూనే వుంటుంది!
మాట్లాడుకుంటున్న ప్రతీసారి
సందేహం
దేహానికి మనసుకి వేరు వేరు చరిత్రలుంటాయా?
మనసు ఒకలా సమాధనం ఇస్తుంది
దేహం ఇంకోలా ప్రవర్తిస్తుంది
దేహం కోరినవాళ్ళు
రూపంతో శ్రమతో వెలకడతాడు!
కనిపించని మనసు వెంటపడి వేధిస్తుంది
గాయాలంటుంది,కన్నీరంటుంది.
ఏది కనిపించనివ్వని చర్మం తొడుగులో పిడికెడు గుండే
జాగారం చేస్తుంది!
చనిపోయాక కూడా దేహంతోనే మాట్లడుతారు
పాచి శవం అని తేలిగ్గా అనేస్తారు
శవంగా అది ఇప్పుడవలేదు
మనసుని చూడకుండా దేహంతో మాట్లాడుతూ బేరాలు
పెట్టినప్పుడే శవం అయ్యింది!
ఇప్పుడు అంటున్నారు
ఆత్మ గాల్లో, దేవుడిలో కలిసిపోయిందని
దేహం సంభాషించుకుంటోంది
ఇప్ప టికీ
ఇక్కడెక్కడో మనసు వుండాలని వెతుక్కుంటోంది
ఈలోగ బూడిదైన దేహం మట్టితో సంభాషిస్తుంది.......

★★★

# ఊహలు ఉత్పాతాలు

విజయ చావలి

ఒంటరి మనిషి ఆలోచనల్లోంచి
తుంటరి వూహలు జనిస్తాయి
ఊహలు వుత్ప్రేరకాలవుతాయి!
వుత్ప్రేరకాలు
వుల్లాసానికో, వుత్పాతాలకో
వుల్లాసాలు
క్షణికాలో , శాశ్వతాలో
క్షణికోల్లాసాలు
మరపుకో, మార్పుకో
శాశ్వతోల్లాసాలు
ఎదగడానికో, వొదగడానికో
వుత్పాతాలు
వినాశానికో, వికాసానికో
వినాశాలు
చరితలు మాసిపోడానికో
వికాసాలు
చరితలు మార్చడానికో

వెరసి
ఒంటరి ఆలోచనలు
తుంటరిగా నలుగురితో పంచుకుంటే
ఇంటిలో కంట తడి పెట్టించవచ్చు
సమస్య సృష్టి కావచ్చు
సమస్య పరిష్కారమవచ్చు

సృష్టి వలన మనిషి తిరిగి వొంటరి కావచ్చు
పరిష్కరిస్తే వొంటరి లేని "మనం" కావచ్చు.

★★★

## ఓ కాలమా..ఇది నీకు న్యాయమా.! లలిత చిట్టె

కాలమా.. ఇది నీకు న్యాయమా?
ఒక క్షణమైనా ఆగక కరిగిపోతావెందుకు?
వడివడిగా పరిగెత్తి పారిపోతావెందుకు?
జ్ఞాపకాలన్ని హృదయంలో నింపి
కనురెప్ప మూసి తెరిచేంతలో.
తరలి పోతావెందుకు?
ఆటపాటల అల్లరి చేష్టలు
మనసారా అనుభవింపక మునుపే..
బడిలో పాఠాలు బుర్రలోకి చేర్చుకోమంటూ..
అందమైన బాల్యాన్ని అలవోకగా తరిమేశావు!!
వలపు పిలుపుల మాధుర్యాన్ని
ఆస్వాదించక మునుపే..
అనుభూతుల పరిమళాలు
ఆఘ్రాణించక మునుపే..
బాధ్యతల భారాన్ని, భుజాలపై మోపి.
యవ్వనానికి వీడ్కోలు పలికేసావు!!
జీవితాన్ని మలిసంధ్యలో చేర్చి..
వార్ధక్యాన్ని ముంగిట నిలిపి
మరణపు అంచుల్లో వయసుని చేర్చి
నిర్దయగా ముందుకు సాగిపోతున్నావు!!
మృత్యువును వాకిట ఆహ్వానించి..
కౌగిలించమని ఆజ్ఞాపిస్తావు.
పుట్టిన ప్రతి జీవి, గిట్టక తప్పదనే..
సత్యాన్ని, నీవు తెలియజేస్తావు!!
టిక్కు టిక్కుమనే టక్కుల మాలపై..
గడియారంలో చేరి..
నీ ఉనికిని ప్రపంచానికి తెలియజేస్తూ..
మా జీవితాన్ని, నీ అడుగుజాడల్లో నడిపించి..
మమ్ము నియంత్రిస్తున్న.. మాయా జాలమా!..
ఓ...కాలమా! నీకిది న్యాయమా!
కాస్త ఆగుమా! .. మాపై జాలి చూపుమా!!

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎవ్వరో హృదయమును బాధించినారు
కలచి వైచిరి మది తటాకమ్ము నేడు
మనసులో నిండిన యశాంతి మరలి పోదు
దినము గడచిన హృదయమ్ము తేరుకొనదు

ఇంత సున్నితమేమి హృదంతరమ్ము
నిశిత భాషణమ్ములను జీర్ణించుకొనదు
వెలిగిపోవును ప్రేమ మాటలను విన్న
క్రుంగిపోవును పరుష వాక్కులను విన్న

కలకలమ్మైన యీ తటాకమ్మునుండి
బయలువడి మరల ప్రశాంతి బడయుటెట్లు
సరళముగ వచ్చి మనసును చల్లబరచి
కలత మాపెడునొక పల్కు వలయునిపుడు

నిశ్చలత నాకు నీదు సాన్నిధ్యమందె
క్షణమదొకటైన నీ రూపు గాంచనెంచి
మనసుకింపైన నీ మాట వినగనెంచి
చెలియ! నీ యింటి వాకిట నిలచినాను

ఏమి యంటివో తిరిగి యోచింపబోను
పలుకు విన్నంతనే మది పరవశించె
ఎంతయో ప్రశాంతత నాదు హృదిని నిండె
నిర్మలస్ఫటికతరమై నిలిచె మనసు

## నీడ

### వ్యాకరణం అచ్యుత రామారావు

ఎండలో నడిచే వాడి నీడ ఎల్లప్పుడూ
అంగ రక్షకుడిలా వెన్నంటే వుంటుంది
నలుగురికోసం బ్రతికే వాడి నిజాయితీ కూడా
నీడలా కనబడుతూ వుంటుంది వాడి నడవడిలో!

నీడ పొడుగైనంత మాత్రాన మంచివాడని
భ్రమపడబోకు
ఉదయించే సూర్యుడి ముందు నిలబడితే
నికృష్టుడి నీడ కూడా పడుతుందెంతో పొడవుగా
ఎన్నికల్లో మన నేతలిచ్చే వాగ్దానాల వరాల్లాగ!

నిజానిజాలనే మధ్యాహ్నపుటెండలో
మంచివాడి నీడ కూడా కుదించుకు పోతుంది
మనిషికంటే చిన్నదిగా!
చేసేద్దామనుకున్న పనులన్నీ చేయలేక పోయిన
కొత్తగా పార్టీ పెట్టిన అభ్యుదయ వాది ఆశయాల్లా!!

★★★

# నిజం

పి.వాణి

నిజం ఎంత కఠినమైందో
ఎన్ని రోజులైనా నిద్రలేకుండా చేస్తుంది
మనిషి ముసుగు ఒక్కోసారి తొలిగిపోతుంది
ఆ నిజాన్ని చూడలేక కొందరు మరణంతో సేదతీరుతారు
కొందరు జీవితాంతం దుఃఖిస్తారు, ఎందుకంటే
ఇది మానవ సంబంధాలని అణచేసిన కాలం
మానవత్వాన్ని సమాధి చేసిన కాలం
జ్ఞానాన్ని విశృంఖలత్వంతో తరిమేసిన కాలం
మేధస్సుని మనోవాంఛలతో బలితీసుకున్న కాలం
ఏ కాలమైతేనేం-
సామాన్యులు బలికావలసిందే ఎందుకంటే
నకిలీని నమ్ముకుని, అస్థిత్వాన్ని అమ్ముకుని బ్రతుకుతున్న రోజులివి
సహజత్వాన్ని శూన్యంలో చూసే రోజులివి
ఎన్నిరోజులైతేనేం
నిముషాలు, సెకన్లు తరలిపోతూనే ఉంటాయి కాలంలో
నిజాల్ని చెబుతూ గుణపాఠాల్ని నేర్పుతూ...!
ఎన్ని పాఠాల్ని గుర్తుంచుకుంటాం.
జీవన పోరాటంలో మనసనే దాన్నే మర్చిపోతుంటే
జ్ఞాపకాలే లేని దేహంలో
గుణపాఠాల గుర్తులు ఏ మస్తిష్కంలో దాగుంటాయి.!?
ఈ పోరాటంలో అలసిపోయి ఎవరి అన్యాయానికో బలైపోవడం తప్ప.
బ్రతకడానికి మార్గం లేని మనకు
బలవడానికి మార్గాలు మాత్రం లెక్కలేనన్ని!! ★★★

# నేను మానని గాయాన్ని

మధుకర్. వై.

మంచితనం మరణించిన చోట
మానవత్వం మంటగలిసిన చోట
మనుషుల్ని మనుషులే చంపుకుంటున్నచోట
మారణహోమానికి మరణం లేని చోట
నేను మానని గాయాన్నే....!
మతం పేరుతో కులం పేరుతో
కుళ్ళిన రాజకీయం పేరుతో
జాతివైరం పెంచి పెద్ద చేసి
ఒకరినొకరు చంపుకొని చావమనే ఈ సమాజంలో
నేను మానని గాయాన్నే....!
పట్టెడన్నం కోసం పొట్ట చేత పట్టుకొని
పట్నంలో బతుకుదామని వస్తే
మనుషుల్ని మనుషులకే తెలియకుండా
మాంసపు ముద్దలుగా మిగిల్చిన నగరంలో
నేను మానని గాయాన్నే....!
పవిత్ర  యుద్ధం పేరుతో పశువులుగా మారి
అమ్మ కడుపులో నుండి వచ్చామన్న నిజం మరచి
అమ్మను అమ్మను కాకుండా చేసిన
దొంగ లం..కొడుకుల రక్తదాహన్ని చూస్తుంటే
నేను మానని గాయాన్నే....!
ఒక కార్గిల్,ఒక పార్లమెంట్
ఒక ముంబై ఒక హైదరాబాద్
సరిహద్దులు దాటి సవాలు విసురుతున్నా
మన చేతకానితనాన్ని చేవలేనితనాన్ని తలచుకుంటే
నేను మానని గాయాన్నే.... !
ఓటేసిన ప్రజల ప్రాణాలను గాలికి వదిలి
చట్టాన్ని చుట్టంగా చేసుకుని అందినంత దోచుకుని
పీకలదాక మెక్కి ఆదమరచి నిద్ర పోయే
ఆడంగి పాలకులు ఉన్నంతకాలం

# అక్షరాలు

డా.జి.శ్యామల

అక్షరాలు ఆప్యాయంగా మాట్లాడతాయి,మాట్లాడిస్తాయి
అక్షరాలు అల్లరిగా నవ్వుతాయి,నవ్విస్తాయి
అక్షరాలు స్నేహమాధుర్యాన్ని పంచుతాయి
అక్షరాలు అరమరికలను తొలగచేస్తాయి
అక్షరాలు ఆహ్లాదాన్ని పంచుతాయి
అక్షరాలు ప్రేమసామ్రాజ్యాన్ని విస్తరింపచేస్తాయి
అక్షరాలు ఆణిముత్యాలై పరవశింపచేస్తాయి
అక్షరాలు మనసు కవాటంలోకి తొంగి చూస్తాయి
అక్షరాలు మెదడు గవాక్షంలోంచి బయటప్రపంచాన్ని చూస్తాయి
అక్షరాలు విహంగ వీక్షణం చేస్తాయి
అక్షరాలు ఆవేశాలను అదుపు చేస్తాయి
అక్షరాలు ఆలోచింపచేస్తాయి
అక్షరాలు కన్నీటి సంద్రాలవుతాయి
అక్షరమే మోక్ష సాధనం
అక్షరం వజ్రాయుధం
అక్షరం క్షరం కాదుకానీ శరం
క్షయం కానిది అక్షయమైనది అక్షరం ★★★



## ఎన్నో తప్పుల తర్వాత

పి.రామకృష్ణ

అర్ధాటున
అమ్మ కడుపులోకో,
ప్రియురాలి మనసులోకో-
వెళ్ళిపోవాలనుంటుంది
మళ్ళీ.!

విసురుగా బయటకు నెట్టేసి,
మళ్ళీ నా అంత నన్ను,
ప్రేమగా దగ్గరకు తీసుకునే-
ఒక్క నువ్వుతప్ప ఎవరుంటారు?
అమ్మా..

మళ్ళీ, మళ్ళీ.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నిలిచి యుంటివి నా చెంత చెలియ నీవు
సంతతమ్మిట నా కనుసన్నలందు
హృదయమును విప్పి నీకెరిగింపకుండ
తలను వంచి వ్రాయుదును పద్యములనేల?

మనసులో దాగియున్న యోచనలనన్ని
వెలువరించి నీ కడ విన్నవించలేను
కాగితము పైన కలమూను క్షణమునందె
ఎన్ని భావములో ప్రవహించునేమి!

జీవమూర్తివై యుంటివి చెంత నీవు
జీవరహితపత్రమ్ము నా చేతనుండె
భావములనేవి నీ తోడ పలుకలేను
ధారవోయుదునీ కాగితమ్ముపైన

మనసునెరుగలేవని యనుమానమొకటి
తిరిగి యేమందువంచు సందేహమొకటి
తలతునిన్ని గోడుల వినదలచవంచు
తలతునీ కాగితము వినగలుగునంచు

పొంచి యున్నట్టి భావముల్ పొంగి పొరలి
వెల్లువై సాగి హృదయంపుటెల్ల దాట
నేకరువుపెట్టి నిను విసిగింతునేమొ!
వేనవేలైననీ పుటల్ స్వీకరించు

# ఎందుకిలా చేశావ్!!?

పద్మా శ్రీరామ్

గుర్తున్నానా అని అడగను
నీవు మరిచిన పెళ్లి మంత్రాలనే వల్లిస్తూ ....
ఎందుకో పాపం రుధిరాక్షరాలుగా నా ఎద సవ్వళ్ళు..
ఎందుకిలా చేసావ్ అని అడగను
కానీ నన్నే పొమ్మనొచ్చుగా.... నేనున్న గుండె గొంతు
కోసేకంటే....
అనాలనుకుంటాను....కానీ కోసేసావుగా కాలపు కత్తితో
నీకు తెలుసా...
నన్ను నేను ఏరుకోవాలనుకుంటూ వస్తున్నా...
నువ్వు విసిరేసిన జ్ఞాపకాల్లో... కానీ ఒక్కచోటా నేను
లేను...ఉన్నది నేనైన నువ్వే
ఎంత చిత్రమో కదా ...
నీ పరిచయమయ్యాక నువ్వున్నావ్ చాలనుకొందేమో
రుధిరాన్ని సైతం మరిచింది నా హృదయం..
నీకు తెలియని విషయమొకటుంది
రుధిరం సైతం భారమేట ....నువ్వు లేని గుండెకు..
స్రవించేస్తోంది..
అయినా సరే నిన్ను వెన్నంటే వస్తున్నా...
నీ ఎడద చిందిన రుధిరాన్నై
నిన్నొదిలింది నేనే కానీ....

నా ఎడద కాదని నీకెప్పటికి తెలియాలో
మనసుకు దప్పికట ... ఎన్ని కన్నీళ్ళు త్రాగినా ..ఆవిరైపోతూ
అందుకేనేమో ...
ఎంత తేలికైపోయిందో నా ఎడద....
నిను చేరగానే విసిరేసావ్!
నేను సైతం నీ జ్ఞాపకాలు వీడని హృదయాన్ని
మోయలేక.... ఇలా విసిరేస్తూ...
రోదిస్తోంది ఎద
నెత్తుటి కన్నీట జ్ఞాపకాలను స్రవిస్తూ
చిత్రంగా ... మనసు మండుతోంది ...
సంద్రంలో సేదతీర్చాలని....
ఈ హృదయం నాకెందుకు...
నీ ప్రేమలో నిండా మునిగాక
నువ్వు విడిచెళ్ళిన గుండె విసిరేస్తున్నా....
నాకు మాత్రం ఎందుకని!!!
నవ్వులెన్ని పారేసుకున్నానో....
నువ్వు దొరికావ్.. ప్రేమకు పూజయ్యింది....
కానీ నిన్ను నిలుపుకున్న నా ఎదకు మాత్రం
నిమజ్జనం మిగిల్చి!!!!!

★★★

# తప్పవుతుందా!?

కె.వి.శాస్త్రి

నీవు దూరమవుతావేమోనన్న
భయం లేకున్నా,
నీవు నా జతలోనే వుండాలన్న
దురాశ లేకున్నా.
నీ మనసు వెంటనే గెలవాలన్న
ఆత్రత లేకున్నా,
ఇంకెవరైనా నీ మనసు గెలుస్తారేమోనన్న
అనుమానం లేకున్నా,
నీ జతలో గడిపిన మధుర సృతులు
మరవలేకున్నా,
జీవితంలో ప్రతిక్షణం మధురం గా ఉండాలన్న
కోరిక వల్లనే -
నా జ్ఞాపకాల వెల్లువలో
సంతోషాల పందిరిలో
విరహాల ఏకాంతంలో
వెలుగుల సంభ్రమంలో
నీ వుంటే బాగుటుందన్న
ఆశ నా మనసుకుంటే
అది తప్పవుతుందా..!!!??

****

## గుప్తనిధి
### శ్రీ రమ్యామృత

కనులు పలకని కలత
అక్షరాలకు అందని అసలు అర్థం
ఎక్కడో ఉండే ఉంటుంది.

అసంపూర్తిగా..
అనామకపు భాషలా
అదరపు అడుగున నలుగుతూ ,

నిశ్శబ్ధంగా..
నిశ్చలనపు నింగిలా
చీకటి కళ్లలో రగులుతూ..,

లేత ఎండలా
పూర్తవ్వని నీడలా
ఉదయపు మౌనంలో ఒదుగుతూ
ఉండే ఉంటుంది ఎక్కడో..

★★★

## సూక్ష్మం
### రిషి శ్రీనివాస్

ఘనమైనదిగా ఏదైనా కనిపించినా,
వినిపించినా, అనిపించినా...
దాని అంకురం చిన్నదిగానే మొదలై ఉంటుంది
బాంబు విస్ఫోటనం అణువు లో మొదలైనట్లు...
నీలాంబరాన్ని చుంబించే ఎత్తైన ఆకృతికి కూడా..
వేడెక్కే బుర్ర లో పురుడు పోసుకునే చిన్న ఆలోచనే
మూలం...
మనసును మీటే గానమై రూపాంతరం చెందిన రాగ
మేదైనప్పటికి...
ఆర్ద్రత నిండిన గొంతులోనే మూర్చనలద్దుకుంటుంది...
హిమవత్పర్వత శిఖరాన్ని ముద్దాడిన పాదం
తన తొలి అడుగు మాతృగర్భపు గోడలపై
ముద్రించుకుంటుంది....
ఖండాంతరాలు దాటి విస్తరించే ఖ్యాతికి నిలబడి
చప్పట్లు చరిచే చేతులక్కర్లేదు చూపులతో
ఆత్రంగా భుజం తట్టగల వివేక నేత్రాలు చాలు!

★★★



## పుష్పవికాసం

శారద శివపురపు

నేడు వికసించిన పుష్పం నేను
గడిచిన గ్రీష్మపు జాడలు లేవు
నిన్నటి మంటల చితుకులు లేవు
రేపటి వెలుగుల ఆశలు లేవు
మెరిసే తారలకై కోర్కెలు లేవు
పున్నమిరేయైనా,అమావాశ్య పొద్దయినా
నా కన్నుల వెలుగే వెన్నెల కాంతులు!
నిన్నటి పొంగుల గరువము లేదు
ఎవ్వరి హంగుల అభిశంశన లేదు
ఎందుకు నాపై కోపం నా నిన్నలో నువు లేవు
ఎందుకంటే నేడు వికసించిన కుసుమం నేను!
సహజీవన మాధుర్యంకై సదా సిద్ధం
నే వెదజల్లే పరిమళం నా సొంతం
అది మోసే గాలుల కంకితం,
ఆశ్వాదించుట కాహ్వానం.!
లేదు కులం నాలో స్పందించే నాడులకి
లేదు మతం నా అభిమతాలకి
సౌందర్య ప్రవంతిలో సర్వం మమైకం
పుడమిలోంచి పొడుచుకొచ్చినా నేను
లేదు ఇసుమంత మాలిన్యం నాలో
బాహ్య మలినాలంటని అంతర్ సౌందర్యం నాది!
నా రేకల, రంగుల అందాలు
ఆ రేఖల పొంగులు,పొందికలు
చూసే కన్నుల సంతసాలు
తూచే మనసుల సౌరభాలు
త్రుంచే చేతుల అభిశాపాలు!
తల్లి ఒడి విడదీసిన ముడికే నేనందం
ప్రాణాలు తీసినా సౌరభాలు పంచడం నా స్వభావం
సూదులతో గుండెలు చీల్చిన దారం ఎదలోపదిలం
దాచుకున్నా, దారం, దుర్మార్గం, గుండె గాయం!
వాడిన పూవుల రాలిన రేకలు
రగిలే గాలులు అణగార్చిన కోర్కెలు
పుడమి గర్భాన దాచుకుని పునర్జన్మనిస్తే
నేడు వికసించిన కుసుమం నేను

కాల్చే ఎండల జ్ఞాపకాలు లేవు
రాల్చే శిశిరపు భయాలూ లేవు
చీకటి వెలుగుల చింతలు లేవు
తోటమాలి తోడు లేదను వేదన లేదు!
వికసించడమే నా ధర్మం
గుభాళించడం నా భాగ్యం
సాటి పూవుల పరిమళం
ఆరాధించడమొక భోగం!
ఉషస్సంధ్యల కాంతులు నాలో ప్రభవిస్తాయి
పరవశించిన ప్రకృతి నాలో పల్లవిస్తుంది
దరిచేరే భ్రమరాలకు తేనెల విందులు
నను తాకే చూపుల పరవశావేశాలు
ప్రేమా, మోహపు సమసమాగమాలు!
గాలికి రాసిన గంధం నేను
పుడమికి వేసిన రంగును నేను
విరించి ఊహకి రూపం నేను
అందమైన భావానికి జీవం నేను
తపించి వేసిన చిత్రం నేను
ధరణిన దైవం మోపిన పాదం
నేడు వికసించిన కుసుమం నేను!
నే పూసిన క్షణాలు విశ్వానికి ఆద్యంతాలు
నా ఉనికి సర్వ ప్రపంచపు ఉనికి
నేను లేని నాడు లేదు ఈ ప్రపంచం
క్షణభంగురమైనా నా జీవితం
నింగిలోని అందాల తారల్లా కాదు
అందరికందే వసంతం నేను
నేలను పూసిన నింగిని నేను
నేడు వికసించిన కుసుమం నేను.!!



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

కన్నులున్నవి మనసుకు కనులు లేవు
శ్రవణములు గల్గి మనసుకు చెవులు లేవు
గళము గల్గియు మాటలు వెలికి రావు
స్థాణువై మిగిలితివి నా దరిని వీడి

ఎంచితిని ప్రేమ ప్రతిరూపమీవటంచు
సంతతము నను నీవు ప్రేమింతువంచు
దినము గడచు – ఇరులు నలుదెసల నిండు
ఉసురు గల్గిన చూతునుషోదయమ్ము

హృదయమొకనాడు భ్రమరమై యెగిరి యెగిరి
అర్పణమ్మయ్యెనపురూపమైన విరికి
నిర్మలానందమున సృష్టి నిండె నాడు
ప్రేమయావిరై విరినుండి వెడలె నేడు

ప్రేమ మరచిపోయి విరి నిర్జీవమయ్యె
ప్రేమ విడలేక నా యెద వెల్లబారె
బదులు రాని చోట బ్రతుకు పణము పెట్టి
కరగి పోయిన కలలతో చెలిగిపోదు

చెంతలేని చెలియను ప్రేమింతునిపుడు
కాలగమనమ్ముతో ప్రేమ కరుగనీను
ఎంతకాలమీ వ్యధ భరియింపగలను?
ఇందుకా ప్రేమికులు మరణించుచుంద్రు?

## అంతర్వీక్షణం

అల్లూరి గౌరీ లక్ష్మి

యుగాల నుండీ ఏడేడు జగాల మీదుగా
బహి ప్రాణం కోసం సాగుతున్న అన్వేషణ
నిత్య నూతనం, నిరంతరం
గమనం తెలీని, గమ్యం చేరని
అనవరత ప్రస్థానమిది
అవిశ్రాంత ఆర్తి , అంతం లేని తపన
నీ నా భేదం లేని ఆత్మ బంధువుకై అనంత గవేషణ
నాటి క్షణాల బాసలు నెరవేరునో లేదో..
ఆరాధనా  ప్రవాహం తీరం చేరునో లేదో
ఈ నిరీక్షణా తపస్సు ఫలించునో లేదో..
ఈ ఆలాపన ఆ అమృత మదిని సోకునో లేదో
ఆ జన్మాంతర సాన్నిహిత్యం కొనసాగునో లేదో..
కొండల కోనల గుట్టల మిట్టలు  దాటి
దిగంతాల వైపు అనాదిగా సాగిపోతూ
సుదీర్ఘ ప్రయాణంలో అలిసి పోయి
గుండె చీలి ఆక్రందనైందిలా "ఓ...........య్ "
ఆశ్చర్యం ! అద్భుతం ! అపురూపం ! అపూర్వం !

"ఓ...... హో......య్ "
లోలోపలి లోయల లోంచి
ప్రతిధ్వనించిన స్వరం
దాహార్తి ఆత్మ సేద దీర్చిన సమాధానం
నా  లోలోపలి అంతరాత్మ ని
మృదువుగా నిమిరిన
సాంత్వన
క్షణ కాల సంక్షిప్త లిప్తల హృదయ తప్త స్పందన
ఇప్పుడొచ్చింది కన్నీరు ఉబికి...ఉబికి...
గుండె లోతుల నుండి పొగిలి... పొగిలి...
మూగవోయిన గొంతు మౌన వీణయ్యింది
మురిసి పోయిన మనసు ఆర్ద్రమై కరిగింది
వానై కురిసింది సముద్రమై పొంగింది
అయింది... ఇప్పుడే జ్ఞానోదయం అయింది !
ఇప్పుడు తెలిసింది ! నన్ను నేనే వెతుక్కుంటు న్నానని!
ఈ అనంతానంతం లో నువ్వు  విశ్వాత్మవని !!
నన్ను లోనికి తీసుకునే  సత్యాత్మవని!!

★★★

# నువ్వో తత్త్వవేత్తవా నేస్తం ?!

నాదెళ్ల అనూరాధ

రాబోయే రహదారుల వెంట నాకోసం ఏదో అద్భుతం
దారి కాచి మరీ వేచి ఉందనే ఆశ
నన్ను ప్రతి మలుపులోనూ ఉత్సాహంగా నడిపిస్తుంటే
సహ పథికురాలివై కలిసిన నిన్ను కాస్సేపు విన్నాను !
ఇవన్నీ ఎప్పుడో విన్నవే నన్న భావం !

మాట్లాడుతూ మాట్లాడుతూ ,
చీకటి గుహల్లోకి మాయమైపోతావ్ !
అంతలోనే అగాధాల్లాంటి సముద్ర లోతుల్లోకి మునకలూ వేస్తావ్ !
కబుర్లకి విశ్లేషణల రెక్కలు తొడిగి ,
సిద్ధాంతాల రూపులు దిద్దుతావ్ !

నీ భాష నాకింకా అలవడలేదు సుమా!
అందుకే కాస్త దూరందూరంగానే తచ్చాడుతున్నానేమో !

అయినా నీ పలకరింపులో చిక్కదనం
నన్నో పరిమళమై అల్లుకుపోయిందన్నది వాస్తవం!!

★★★

# అమ్మ మాట

స్వర్ణ అట్లూరి

సదూకుంటే నీ బతుకు బాగుంటాది
లేకుంటె నా లెక్కన ఇంటిపనికే అంకితం అంటే
సదూకున్నోళ్ళూ సేయాల్న గందా ఇంటి పని
అనుకుండె
తెలీలే అమ్మా...నీ మాట విలువ
తొలి జీతం సేతికొచ్చిందాక ...

కాలేజి రోజుల్లొ కొత్త సోకులు నేరుస్తుంటె
'సోకు సారాకు మొకం బీరాకు' అని సామెతలతో
సిన్నబుచ్చుతా ఉంటె
నీ కళ్ళలో మెరుపు రెప్పవెనుక దాస్తివని
సమజ్ గాలె అమ్మా... అందులో అమ్మతనం
నాకూ ఓ ఆడ బిడ్డ పుట్టిందాక...

ఇంటికొచ్చినోళ్ళని మంచిగా మందలించలేదని
సీవాట్లు పెడుతుంటె వాళ్ళెవరికోసమొ నన్నే
తిడితివని
నాకంటె బంధువులు యెక్కువాయె అని మధన
పడితిని
అర్థంగాలే అమ్మా...నీ మాటలో లోతు
నేను ఓ ఇంటి కోడలిని అయిందాక...

అత్తవారింట అన్నిటికి తలొంచి నువ్వుంటె
కడుపు మండుతుండేది నీకేమి తక్కువ అని
అదేమంటే గట్లనే ఉండాల అని పాఠాలు సెప్తుంటే
వళ్ళు మండేటిది అమ్మా...ఓ నాడు నా మామగారు
'మంచిగా సూస్తవ్ బిడ్డా నన్ను నా ఆలిని '
అని సెప్పిందాక...

మళ్ళ జన్మంటూ ఉంటే నీ ఇంటనే పుడతా
నీ సనుగుడే వింటూ నీ బిడ్డగానే పెరుగుతా
తిడితే తిట్టినవ్ కొడితే కొట్టినవ్
దయుంచి నా అమ్మ మళ్ళ నీ కడుపునే కనవా
మరు జన్మలో వీలుంటే జరంత తక్కువ విసిగిస్తా...

★★★



# హైకూలు

రామకృష్ణ క్రొవ్విడి

కనబడుట లేదు
చంద్రుడు
ఇట్లు – అమావాస్య

★★★

గోడమీద కేలండర్ కు
డాన్స్ నేర్పుతోంది
సీలింగ్ ఫేన్

★★★

అర్థరాత్రి భైరవనాదం
ఒంటరి చీకటికి
ఒకటే భయం

★★★

ఇంద్రధనుసుతో
రంగుల బాణాలేసుకుంటూ..
ఎండ, వాన!

★★★

పువ్వుల ముందు
నవ్వుల పాలయ్యాడు
తేనెతాగే తేటిగాడు

★★★

మంచు దుప్పటిలో
దూరింది
వణుకుతున్న చలి

★★★

సిరానది పుష్కరాలు
కాగితం గట్టున
అక్షరాల స్నానాలు

★★★

కొంగపూలు పూసింది
పొలంగట్టున
తుమ్మచెట్టు

★★★

చీకటి కేన్వాస్ పై
రాతిరి చల్లిన
వెండిరంగు – వెన్నెల

★★★

మబ్బుల పైటేసి
వాన కన్నుగీటింది
మెరుపు సుందరి!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

మాటలాడుట నాతోడ మానవలదు
మరలనీయకు నన్ను నీ మనసునుండి
తరలి నానుండి యెచటికో యరుగబోకు
బ్రదుకనిమ్మొక మూల నీ హృదయమందు

ఎన్నడో నిను నేను వేధించియుందు
ఏవొ సొదలతో నిను విసిగించియుందు
ఈయలేనట్టి ప్రేమనర్థించియుందు
అడిగినది ప్రేమయే, క్షమార్హుడను గానొ!

తిరిగి నను నీవు ప్రేమించు తీరు లేదు
కలసి నాతోడ నడచు భాగ్యమ్ము లేదు
ప్రేమ యెవ్వరికైననర్పింతువేమొ
తలపులోనైన నను నీవు నిలువనిమ్ము

ప్రేమ యనగనేమొ భావించుచుంద్రు
కలసి జీవించుటొక్కటే గమ్యమంద్రు
సతము నీ చెంతయుంట యసాధ్యమైన
నిలిపెద చిరాయువుగ నిన్ను తలపునందు

తలపులవి యెంత కాలమ్ము నిలచునన్న
అంటియుండును జీవమున్నంతవరకు
తీరిపోవక నిల్చునదృష్టమున్న
యుగయుగమ్ములు మనసుననుండువీవు

# ఓటమి తర్వాత

ఎంవీ రామిరెడ్డి

ఒక ఓటమి తర్వాత
తీరిగ్గా విశ్లేషణలు మొదలు పెడతాం
తలపుల గడ్డపారలతో గతాన్ని తవ్వుకుంటాం
లోపాల అస్థికల్ని బయటికి లాగుతాం!

★★★★

తొలి అడుగు వేసిన రోజే
దుర్ముహూర్తం వెంటాడిందా?
ప్రణాళికల రూపకల్పనలో
వ్యూహరచన బెడిసి కొట్టిందా?
శస్త్రాస్త్రాలు సమకూర్చుకోవడంలో
నాణ్యతాలోపం వెక్కిరించిందా ?
ముఖచిత్రాలు కరపత్రాలు
గాలివాటుకు కొట్టుకుపోయాయా?
నిబంధనల సంకెళ్ళతో
నడక లయతప్పిందా?
పచ్చకాగితాల పరిహారంలో
లెక్కలు పక్కదారి పట్టాయా?
సైనిక కవాతులో అపశ్రుతి దొర్లిందా?
వాస్తు దోషమే కొంపముంచిందా ?

★★★★

పంచనామాల సుడిలో పడి
మూలాల గురించి మరిచిపోతాం
రంధ్రాన్వేషణలో తలమునకలై
రక్తనమూనాలను గాలికొదిలేస్తాం

★★★

శిఖరారోహణ ఒక్కటే ధ్యేయం కాదు
గెలవకపోవడం ఒక్కటే ఓటమికాదు
ఆత్మద్రోహమే
అసలైన ఓటమి !!

★★★★



# ఎస్. ఆర్. బందా

చాలా వీలు
తడిమి చెప్పనక్కర్లేదు – తరచి అడగనక్కర్లేదు
నేన్నీకు నచ్చానా అనీ – నాకు నువ్విష్టం అనీ
పదేపదే అననక్కర్లేదు

కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసినట్లే వుంటుంది కానీ
దాన్నంత పట్టించుకోనక్కర్లేదు
చెమర్చిన గుండె భాష తెలిసేనో లేదో అని
అంతగా చింతించనక్కర్లేదు
తెలియని భాషలో చెప్పిన ప్రేమని
అర్థం చేసుకున్నట్లు నటించనక్కర్లేదు

అలా..
అనాయాసంగా – ఆకుపచ్చా నలుపూ ఎరుపూ
నీలం చారల మచ్చల గురించి
చూస్తూ గడపడానికి ఆలోచించనక్కర్లేదు

ఎంత మధురమీ ప్రేమ! ఎంత నిశ్శబ్దమీ ప్రేమ!
నా చూపు నాలోకి మళ్ళీ దూసుకెళ్ళి
చిరు గుళికెలకోసం★ చప్పున నోళ్ళు తెరిచి
చిన్నచిన్న అలలు పుట్టిస్తూ
అదేపనిగా అటూ ఇటూ
ఈదుతూ –

ఎంత హాయి ఈ ప్రేమ!
పరమ వీలు సుమా – ఈ

**- - -.. అక్వేరియం!**

--------------

★ ఫీడ్

# సంఘజీవి

శశిప్రియ వంగల

ఏకాకిని నేను
సుదూర తీరాలకు నా పయనం
గమ్యం తెలియని ప్రయాణం నాది
జీవితంతో రాజీ పడలేక
సంఘంతో ఒంటరిగా పోరాడుతున్నాను!
నా ఈ సుదీర్ఘ గమనంలో
ఎన్ని తప్పటడుగులు వేశానో
ఎందరి మీద రాళ్ళు విసిరానో
ఎన్ని హృదయాలను ముక్కలు చేశానో
ఎన్ని అద్దాలు పగలగొట్టానో
ఎన్ని బుడగలు పేల్చేశానో..!
పశ్చాత్తాపంతో -
ఎన్ని పాదాలను నా కన్నీటితో అభిషేకించాలో
ఎంతటి హృదయ వైశాల్యంతో కుసుమాంజలి
సమర్పించాలో..!
తప్పులను సరిదిద్దుకునే అవకాశం కోసం
వేచి చూస్తూ ఎన్ని యుగాలు గడిపానో
చేసిన పొరపాటు మళ్ళీ చేయకుండా ఉండేందుకు
ఎన్నెన్ని ప్రయత్నాలు, ప్రయోగాలు చేశానో..!
నన్ను పట్టుకోమని ఎన్నిసార్లు చేతులిచ్చానో
నా చేయి వదిలేస్తే ఎన్నిసార్లు ఏడ్చానో
ఎన్ని దెబ్బలు తిన్నానో
ఎన్నిసార్లు పడిపోయానో
ఎన్నిసార్లు మోసగింపబడ్డానో
నన్ను నడిపించే శక్తే నా బలంగా
ముందుకు నడిచేందుకు ఎంత యత్నించానో..!
ఒక్కరిలోనైనా పరివర్తన తేగలిగితే
నా జీవితం ఒక పాఠం కాదూ..!

★★★

## నాకూ నవ్వాలని ఉంది..
సుకేశిని

అస్తిత్వం నిలుపుకునే ఆరాటంలో
ఎన్ని ఓపికల మొలకలకు ఊపిరులద్దను!
వెన్నెల వెలుతురంటి ప్రేమకోసం
ఎన్ని నిశిరాత్రుల నిట్టూర్పు సెగలు విడువను!
నాకూ నవ్వాలనుంది హాయిగా,
కన్నీటి చారలను దాస్తూ
విరిసిన మొనాలిసా నవ్వుల్ని చెరిపేస్తూ!
నాకూ ఎగరాలనుంది స్వేచ్ఛగా,
రెక్కలు తెగిన విహంగపు బ్రతుకు విడిచి
ఆంక్షలు హద్దులు లేని
రంగుల సముద్రం లాంటి భవితవైపు....!

★★★



## క్షణకాలం
బొడ్డపాటి ఆనందరావు

ఈ కడలితరగల నురగలలో
ఒక బుడగనై క్షణకాలం
పొంగనీ, ఊయలలూగనీ, పేలిపోనీ.

ఈ ఝంఝూమారుతవీచికలలో
ఒక యాకునై క్షణకాలం
ఆడనీ, వేగంగా సాగనీ, తేలిపోనీ.

ఈ దావానలజ్వాలలలో
ఒక తృణకణాన్నై క్షణకాలం
మండనీ, పైకిలేవనీ, వ్రేలిపోనీ.

ఈ నీలాకాశవీధిలో
ఒక కారుమబ్బు తునకనై క్షణకాలం
కరగనీ, తీరులేక తిరగనీ, తూలిపోనీ.

ఈ అనంతవిశ్వాంతరాళంలో
ఒక చిన్న యిసుకరేణువునై క్షణకాలం
సూర్యకాంతిలో మెరవనీ, బ్రతకనీ, సోలిపోనీ.

★★★

# జాలవిహారం

గంగిశెట్టి

పొద్దుటే బుద్ధిగా గణకంపెట్టె ముందు కూర్చుంటున్నాను
మీట నొక్కడం నేర్చుకొంటున్నాను
కీలెరిగి అంతర్వేది పట్టుకోవాలేకాని
ప్రపంచంలో ఎక్కడ మునిగి ఎక్కడైనా తేలొచ్చు
గూగులమ్మకు దండం పెడితే
ఏ వాగులోనైనాబడి ఈతకొట్టొచ్చు!
కొందరు గజఈతగాళ్ళుంటారు
ఇల్లూవాకిలి పెళ్ళాంపిల్లలు ఏవీ పట్టవ్
ఎప్పుడూ అంతర్వేది ప్రవాహంలో కొట్టుకుపోతుంటారు !
వాళ్ళ ప్రపంచం వారిది
ఈ లోకం వాళ్ళకు ఓ కారు,బ్యాంకుల విడిది
నిరంతరం వారిది ముఖచిత్రవిహారం
ప్రతి మనిషీ వారికి ఓ బొమ్మే
ప్రతి అంశం అరచేతిలో దృశ్యమే
ఎదుటి గొంతక్కర్లేదు
పెట్టె పలుకుంటే పరమానందం
అక్కడ నువ్వూనేనూ గతకాలపు కాగిత అవశేషాలం!
కాదంటే ముఖసిత్రాల నడుమ ఊడిపడే
విచిత్రమార్కులం
అలాటివారినడుమ మనదెంత విలాసవిశేషం ...
ఏమండోయ్ నేను మీ అబ్బాయిననటం లేదు
పాతికేళ్ళక్రితం మీరేమిటనే నా
ప్రతిబింబాన్నడుగుతున్నాను
వస్తుమార్పిడీ రూపమార్పిడే కానీ
తీరు మార్పిడి కాదుగా!
చోటుమార్పిడే కానీ వేటుమార్పిడి కాదుగా!!

★★★

# కొనగోటి వీరులు

శ్రీకాంత్ ఒద్దిరాజు

వింతవింతల ప్రపంచాన
*విశ్వబూజను కొలిమిలోన
కాలమంతా కరగదీస్తూ
చెలిమి నెలవుల వేటలోన
కలత తలపుల బాటలోన
★వదనసంపుటమొక చేతబూని
కానలేని మోజ వెంట
భ్రాంతిజీవన క్రాంతిలోన
సహజ జీవన కాంతి క్షయమై
సహజీవనం సంక్షుభితమైతే
జంగమములన్నీ స్థావరములే
బ్రతుకునేర్పు బాసిపోతే
జీవితాన మేరునగధీరులెవ్వరు
ఉన్నదంతా మేటి కొనగోటి వీరులే

*worldwideweb
★facebook

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

రాలునాకుకు తెలియదు బ్రతుకు బాట
గాలి తరలించు దిశ తన గమనమౌను
నడచునిటువైపు నటువైపు నడచు మరల
ఎగిరిపోవును, మరల తానిలను వ్రాలు

ఎచటకేగునొ తెలియదు – ఇల్లు లేదు
వదలి వచ్చిన కొమ్మ జ్ఞాపకము లేదు
వలయు జీవితమేదియో తెలియ లేదు
అనవరతమూరకే తిరుగాడుచుండు

గగనపథమున సాగెడు గ్రహములెపుడు
మార్గము విడవు బాధ్యత మరచిపోవు
కక్ష్య తప్పక ముందుకు కదలుచుండు
విస్మరింపవు తమవైన విధులనెపుడు

మరలనదె మార్గముననెన్ని మారులైన
అరుగుచుండును విధినిర్వహణము కొరకు
అలుపెరుంగని యా యోర్పు వలయు మనకు
పథము తప్పని నేర్పు కావలయు మనకు

పుడమి జనియించి కడకిల్లు విడచు వరకు
అనుదినము మనకెన్నొ బాధ్యతలు గలవు
నిశ్చయమ్మైన మార్గమ్ము నిలిచెనెదుట
దారి తప్పక సాగుట ధర్మమౌను

## రేపటి ఆశ

స్వర్ణ అట్లూరి

కంటిలో నలక పడితేనే
దూలము దిగినంత దుఖిస్తూ
కడివెడు కన్నీళ్ళు కార్చుతూ చీకట్లోనే ఉంటే
ఎన్ని తారకా రవి చంద్రుల వెలుగులు
నీకు కనిపించకుండా వచ్చి పోతాయో
కళ్ళు తెరచి తిరిగి చూడకుంటే...

కాలిలో ముల్లు దిగితేనే
దుండెలో గునపం దిగినట్లు భావిస్తూ
హథవిధీ అని చింతిస్తూ దిగాలుగా కూర్చుంటే
దారినున్న గడ్డిపూల మీద
తుమ్మెద వయ్యారాలు చూసి ఆనందిచేవాడివా
కాలినున్న ముల్లు తీయను క్రిందికి వంగకుంటే...

చిరుజల్లు తో జతగా ఓ మెరుపు వస్తే
పిడుగు పడుతుందేమో అని భయపడి
అతి జాగ్రత్తకి పోయి లోపలే దాక్కొని ఉంటే
ఆకాశం లో హరివిల్లు అందాలు
వాననీటిలో కాగితపు పడవ చందాలు
చూడగలవా ఒక అడుగు బయటికి వేయకుంటే...

ఉరుము ఉరిమిందని శబ్దానికి బెదిరి
చెవులు మూసుకొని నిశ్శబ్ధం లోనే మనశ్శాంతి అంటే
హితవు కోరి చెప్పే మంచిమాటతో పాటు
కోయిల స్వరం పీడిన వసంతగీతం కూడా
నీ చెవిన పడక వెళ్ళిపోదా
కష్టమే అయినా కాస్త మనసు పెట్టి వినకుంటే...

కష్టం వచ్చేనని బెంబేలు పడిపోయి
బ్రతుకు బండి నడిపే ప్రయత్నం మాని కాడి విసిరేస్తే
నీ కాడి బరువు ఇంకెవరు మోస్తారు
ఆకులు రాలాయని చెట్టు చిగురించడం మానిందా
కష్టం కడలి దాటితే సుఖం వచ్చేయదా

నిన్నటి జ్ఞాపకం సాక్షిగా
రేపటి ఆశలతో
నేటి లోకి దూసుకు పోకుండా నడకే ఆపేస్తే
కాలచక్రంలా జీవిత గమనం సాగేదెలా
మారే రుతువులతో ఆకు రాలితేనే కదా కొత్త చిగురు వచ్చేది
రేపటి ఆశల చిత్రం మీద కొత్త వర్ణాలను విరజిమ్ముతూ...!!

★★★

# రెక్కలు

డా.రమణ యశస్వి

అమ్మ నాన్నలే
నిచ్చేన నాడు
వృద్ధా శ్రమం
పంచన నేడు
- రెక్కలొచ్చిన
పిల్లలు

★★★

ఆకాశం
ఉరిమింది
మేఘం
మెరిసింది
- నాన్న
అమ్మ

★★★

నిశ్శబ్దంగా
పేపర్ చదువుతుం టే
నా రక్తం
మరుగుతున్న శబ్దం
- రోడ్లు రక్తపుటేర్లు
అతివలు అరిటాకులు

★★★

మట్టి
వినాయకుడు
బుద్ధి లేని
నాయకులు
- నిమజ్జనం
జనానికి శుభాలు

★★★

డాలరు దయ్యం
పట్టిన రూపాయి
విదేశి పెట్టుబడు ల
భూతం ప్రత్యక్షం
- రెక్కలొచ్చిన
ధరలు

★★★

ఆకాశంలో
ధరలు
పాతాళంలో
రూపాయి
- రెక్కాడింది
డొక్క మాడింది

★★★

ఇంగ్లీషు
దొరసాని
తెలుగు
మంత్రసాని
- అ ఆ ల తెరచాటున
ఏ బీ సీడీలు పుట్టించింది

★★★

గర్భాశయము
సంచీలు నింపుతోంది
గర్వాతిశయము
మని'షి' ని చంపుతోంది
- అమ్మతనము
అమ్మకానికి

★★★

## ఆలోచనలు

శారద శివపురపు

వాలింది
గుడి గోపురమ్మీదనైనా
గ్రద్ద దృష్టి
ఎప్పుడూ
కిందనున్న ఎలుకమీదే!!

★★★

మనసు విరిగి
మాటాడకు
మనసులు విరిగే
మాటలాడకు





★★★

మరణం ఉనికి
తెలిసినదే
జీవనం!
జీవితం విలువ
తెలిపేదే మరణం!
ఐనా జీవితం ఎప్పుడూ
జీవన్మరణ పోరాటం...!!

★★★

నీ ఉనికి గుర్తింపు
ప్రేరణ!
గుర్తు కోసమే ఉనికి
ఉన్మాదం!!

★★★

# అతివనే

రావి సురేష్ బాబు

ఇంకా పుట్టనే లేదు...
హత్య చేయబడ్డాను
ఎందుకంటే
నేనొక గర్భస్థ ఆడపిండాన్ని

ఇంకా కన్ను తెరవనే లేదు
చెత్తకుప్పలో విసిరేయబడ్డాను
ఎందుకంటే
నా తల్లో 'కన్నె'పిల్ల మరి

ఇంకా బాల్యపు స్పర్శ వీడనే లేదు
తిమిరంలో కరిగిపోతున్నాను
ఎందుకంటే
నేనో కలలు కాటేసిన కౌమారాన్ని

ఇంకా కళ్ళకి కలల తడి తాకనే లేదు
నడిరోడ్డుకి వార్తనయ్యాను
ఎందుకంటే
నేనో కీచకుల గుంపుకి చిక్కిన అబలని

ఇంకా తొలి జీతం అందుకోలేదు
నా మానానికి ముప్పొచ్చింది
ఎందుకంటే
కార్యాలయంలో నేనో కొత్తపిల్లని

ఇంకా ప్రేమ ఊసులు మరవనే లేదు
మా ఇంటి దూలానికి ఉరివేయబడ్డాను
ఎందుకంటే
మా కులానికి పరువు పరదాలున్నాయని

ఇంకా కాళ్ళ పారాణి ఆరనేలేదు
నట్టింట్లో అగ్నికి ఆహుతయ్యాను
ఎందుకంటే
వరకట్న పిశాచుల నిలయమది

ఇంకా మమతలకర్థం తెలియనే లేదు
స్వేచ్ఛ చచ్చిన మానవ యంత్రానయ్యా
ఎందుకంటే
నేనో మాంగల్యమేసుకున్న ముత్తైదువని

ఇంకా కన్నపేగు పిచ్చి తీరనేలేదు
బిడ్డలకి నా పొడే గిట్టటం లేదు
ఎందుకంటే
నేను ఏమీ తెలియని అమ్మని మరి

ఇంకా ఆయన నా కళ్ళలోనే ఉన్నారు
అయినా నేనెదురొస్తే అరిష్టమంటున్నారు
ఎందుకంటే
నే తల చెడిన విధవని మరి

***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎవ్వరికి చెందదీ ప్రేమ యెదనె నిల్చు
ఎవరికిచ్చిన గాని వారెరుగలేరు
తలుపు తట్టునానందమ్ము తెలియరాకరు
బ్రతుకు వేగాన రససిద్ధి వదలునోకరు

పరుగు పరుగుననెచటికో యరుగు తరిని
బ్రతుకనేర్తుము, హృదయమ్ము శ్వాస మరచు
ఆగి వెనుకకు చూచిననా క్షణమ్ము
శ్వాస దొరుకదు, హృదయమ్ము వశము తప్పు

దారి ప్రక్కల సుమముల ధ్యాస లేక
ఇంద్రధనువు వర్ణమ్ములనెరుగ లేక
ముక్కు సూటిగ పోవుటే ముఖ్యమయ్యె
ఎండిపోయినవెదయు పంచేంద్రియములు

ఎవ్వరిని పల్కరింపంగనేమి ఫలము?
ఎవరి మనసును తాకగ నెవరి తరము?
వడివడిగ పరుగులిడెడు వారు వారు
బ్రతుకునది మేను, హృదయాంతరమ్ము కాదు

ఏల జీవితమ్మిటు రసహీనమయ్యె?
ఎద కవాటమ్ము మూసినదేమి శక్తి?
లేని వ్యవధియో! మరి మనఃక్లేశమేమొ!
ధనము రాజైన మదికి స్వాతంత్ర్యమెట్లు?

## బాలమురళీయం

డా.సి.భవానీదేవి

వెన్నెల గడ్డకట్టిన మంత్రముగ్ధత్వం
సప్త స్వరారాధనంలో తన్మయ తరంగం
విద్యుత్ రోమాంచితస్థాయిలో
విభావానుభావాను భూతిగా
శ్రోత్రు కర్ణ పేయామృత ఝరీప్రవాహం
సకలజన రంజక గానసుధారసపానం
స్వరపరిమళ వీచికాప్లావిత వాయులీనం
జన్మజన్మానుగత సుకృత స్వరస్థానం
మనోమయ మందిర మణిరాజితం
పురుషరూప వాగ్దేవతా వైభవం
సాగర కెరటాలాపనా సంజనిత
వీచికా ప్రణవోన్మాదం
నాదోపాసనాలంకృత నైరూప్య
గానగాత్ర గాంధర్వం
విమల వినిర్ముక్తగమకిత
స్వర ధనురాకాశం
కాంచన మణి మేఘలాయంత
కళాసరస్వతీ సమర్పిత కమనీయహారం.
రవళిత రమణీయ రసరాగప్రస్తారం
కల్పనా తీత అనుభూతి ఆలయం
చిన్మయాద్భుత చిరంత నానందపానం
స్వరార్ణవ క్రీడాసక్త జన వశీకరణం
పరమ పునీత సంప్రదాయ
సామగాన ప్రాభవ రక్షాకంకణం
కాలస్పృహ విస్మరిత మనోమయ మంత్రనగరం
అలౌకికానంద ప్రదాత్మక మూర్తిమంతం
సాకార రూపిత జలదఝంకారం
సారూప్య తేజ విరాజిత వీణారవం
ఆరోహణ అవరోహణా సూత్రిత నిధానం
శాసిత గమకిత శారదా సంసేవ్యమానం
భూమ్యాకాశ బంధిత సంగీత శిఖరం
బాలమురళీ దివ్య భవ్యనందామృత వర్షం
నాదామృత జన సుకృతం
ఆధునిక సంగీత వాగ్గేయకారం
ఆజన్మాంతర భవబంధమోచనం
ప్రణమామ్యహం.. వందనాభివందం

***

(మంగళంపల్లి బాలమురళీకృష్ణగారి పాట వింటే..)

# బాల్యం ఒక మోహ నది! 

వెంకట్

ఎంత రాసినా తరగని తనివి తీరని బాల్యం
ఒక పల్లెటూరు, ఒక నది
ఒక వెన్నెల రాత్రి,, ఒక మోహన ధాత్రి...

వెరసి
సరసిజనాభుని శయ్యలా
వొంపులుగా పరుచుకున్న ఒక వెన్నెల యేటి నీటిలో
నింగి నుంచి రాలిన చుక్కల పొడి లాంటి
తెలి చక్కటి ఇసుకలో
అకర్మకంగా చేసింట్లుండే ఒక ఆకస్మికపు నడక...

గాలిబుడగలా, గాలిలో బుడగలా
పాడనవసరం లేని పాటలా
తీరం చేరనే అక్కరలేని పడవలా

ఎంత నడిచినా
తరగని తనివితీరని బాల్యం

తనువులో అంతర్థానమై
తలపులో అంతర్వాహినిలా ప్రవహిస్తూన్న
ఒక మోహ నది!

తెరచి వుంచగాలేని ఒక స్వప్నాల గది!

★★★

## అభి 'మానులు' కాకండి

డేగల అనితాసూరి





మనసు స్పందిస్తే కవితలు రాస్తారు
హృదయం ఉప్పొంగితే కథలు మలుస్తారు,
బ్రతుకు తెరువు కోసమో
ప్రవృత్తిలో సంతృప్తిని వెతుక్కోవటం కోసమో
వెండి తెరపై కెక్కుతారు,
కార్యోన్ముఖులై ప్రజాసేవ కోసమో
కీర్తి ప్రతిష్టలపై ఆశతో స్వీయ సేవ కోసమో
ఉన్నత పదవులు చేపడతారు ,
అలా పూనుకున్న వాళ్ళందరూ
ఆకాశాన్నుంచీ ఊడిపడిన వాళ్ళు కారు ౦
అలాగని నిందుసున్నాలు అసలే కారు!!
చేతకానివాళ్ళు మధ్యలో మాయమౌతారు
చేవవున్నవాళ్ళు కొన్ని మనసుల్ని తాకుతారు
అంతమాత్రాన వాళ్ళే 'సర్వస్వం' గా భావించే అవసరంలేదు
అన్నివేళలా అనుకరించి తరించాల్సిన పనిలేదు
అభిమానించాలి....గుణగణాల్ని!
ఆరాధించాలి.... గొప్పతనాన్ని!
వల్లమాలిన అభిమానంతో కళ్ళు మూసుకుపోతే
వారి కనుసన్నలలో మెలగడం అలవడితే
సమాజానికి నిజమైన అభిమానులు కరువై
సర్వత్రా కేవలం అభిమతానికి చలనంలేని
అభి'మానులు' గా మాత్రమే మిగులుతారు!

★★★

## ఏ మాసమైతేనేం?
## నాదెళ్ళ అనూరాధ

అవి మాఘ మాసారంభపు రోజులు !
మంచు తెరలు ఒకింత త్వరగా కరిగి
మాయమవుతున్నవేళ !
తూర్పు వాకిట్లో
వెలుగుపువ్వుల ముగ్గులేసేందుకు
ప్రకృతి యావత్తూ సమాయత్తమవుతున్న వేళ !
అలవాటైన దారుల వెంట
చిరువెచ్చని కాంతులు
నిశ్శబ్ద ప్రవాహాలవుతున్న వేళ !

...... .... ..ఎక్కడో దూరంగా వినిపిస్తున్న
పాపాయి ఏడుపు!
బద్ధకపు దుప్పట్లో
మరింతగా ఒత్తిగిల్లుతున్ననిద్ర
మెలకువవుతున్న వేళ !
మడత పెట్టేసిన శరీరాన్ని ఒక్కసారి దులిపి
పక్క దిగుతున్న వేళ !
కిటికీ బయట ప్రహరీ మీదుగా నైట్ క్వీన్ ని నిద్ర
కమ్ముతున్న వేళ !

గడియారపు ముల్లుకు కట్టిన కొంగుని,
ప్రపంచమంతా చుట్టి తనలోకి లాక్కున్న అమ్మ
పరుగు ఆరంభించే వేళ !

అవును, అది ఏ మాసమైతే ఏమిటి ?

****

## కృష్ణం వందే జగద్గురుం ..
## ..ఇవటూరి బాలాత్రిపుర సుందరి

పొగడపూల సరాలల్లగలనే మోగాని ..
స్వరం సారించి నీపాట పాడలేను,
కమనీయ ప్రకృతిని కంటితో చూడగలను గాని..
కనుమరుగునున్న నీరూపాన్ని నే దర్శించలేను
పొంగినకన్నీటితో బాధ దింపుకోగలను గాని .
.పొదువుకున్న నీస్వాంతన తెలియగారాదు నాకు ,
కడలి తరంగ తుంపరల చల్లదనం యెరుకగాని ..
బడబాగ్ని దాచిన నీవిరాట్ మూర్తినేనెరుగలేను ,
ఘోషించు కడలి కల్లోలము విందుగా విందునుగాని
..ఘనమైన నీ నిజకీర్తి మందబుద్దిన విననందు ,
నిశ్చల నిశీథిలో కదిలే దీపాల వెలుగు నిజమందు ..
నీకాంతి పుంజములు చూడక నే కనులు
మూసుకొందు,అవకాశమీయగా..కాయమ్ము పొంది
..అవకాశవాదినౌదుగాని .
.సాయుజ్య సామీప్యముల కోర..నే కోర ..!!
నల్లనివాడా నే గొల్లపిల్లనోయీ ..అని విన్నవించుదుగాని
..నామనసు వెన్నలా చేసి నీ కర్పించలేను ..
అంతా నీకృపయే ..అన్న ఆలోచనమాని ..
అహంకరించూనాకు ..తోచదొక్క నీ ఆప్యాయ వాక్కు ..!
గణవిభజన ..చ్ఛందోబద్ధత నేనెరగగాని .
.త్రుటిలో గల్గిన ..నీచింతన చింతనై ..
నామది నిను చింతించెనోయీ ..!
ఆలోచనలాగినచోట ..బుద్ధి ప్రజ్వలన నిజమైతే
..పాలపుంతవెలుగున చూపు నీ..ప్రత్యగాత్మ రూపం..!

****

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎంత కాలమ్ము నా తనువిటుల యుండు
మార్పు పొందక నాకు సమ్మదము గూర్చు
ఆవహించు జరత్వమ్మునాపగలుగు
ఇంటికరుదెంచు మరణమ్మునెదురుకొనును

ఏది మార్పు చెందక యుండు సృష్టి యందు
కరగిపోవునవే యన్ని కాలమందు
తనువు రుగ్మతకొకనాడు తలను వంచు
మది యిలను వీడి యెచటికో మరలిపోవు

స్వప్నములు కందు మనసు శాశ్వతమటంచు
తెలియునెప్పుడు ప్రేమ నిశ్చలమటంచు
మార్పునెరిగిన ప్రేమ ప్రేమ యెటులౌను
మరణమెరుగని ప్రేమకు మనసు వలయు

ప్రాణమున్నది మదియందు రాగమందు
ఈ యిలను వీడి యెచటికో యేగునివ్వి
స్వర్గధామము వారసత్వమ్ము మనకు
ఆడుకొనుటకే ధరణి క్రీడాంగణమ్ము

నిమిషములతోడ సర్వమ్ము సమసిపోవు
నిత్యమైనట్టి ప్రేమయే నిలచి యుండు
శాశ్వతమ్మైన ప్రేమయే స్వర్గసమము
దాని శ్వాసయై జీవించు మానసమ్ము